జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## మంత్రి సుభాష్‌తో ప్రాణహాని



- గంధం పల్లంరాజుతో కలసి అంతమొందించే కుట్ర
- దొంగతనం కేసులున్న వారితో కలసి నాపై ఎస్సీఎస్టీ కేసు
- లోకేష్‌కు ఫిర్యాదు చేసినందుకు నాపై అక్రమ కేసు
- దొంగలబ్యాచ్‌ను ప్రోత్సహించ వద్దన్నందుకే నాపై అక్రమ కేసులు
- మంత్రి సుభాష్ నాకు మంచి మిత్రుడే
- తోట త్రిమూర్తుల నుంచి కూడా ప్రాణహాని
- ఎస్పీకి రామచంద్రాపురం టీడీపీ నేత, శెట్టిబలిజ నాయకుడు మేడిశెట్టి ఇస్రాయేల్ ఫిర్యాదు

**రామచంద్రాపురం:** కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ.. రామచంద్రాపురం నియోజకవర్గ టీడీపీ నాయకుడు, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు మేడిశెట్టి ఇస్రాయేల్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంత్రి సుభాష్‌తన అమలాపురం నియోజకవర్గానికి చెందిన గంధం పల్లంరాజుతో కలసి.. తనను అంత మొందించేందుకు కుట్ర చేస్తున్నట్లు తనకు సమాచారం ఉందంటూ, తన ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రితోపాటు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తోటత్రిమూర్తులు నుంచి కూడా ప్రాణహాని ఉందంటూ ఇస్రాయెల్ మిగతా.. 2లో

# అక్కరకు రాని అనుభవం!

- టీటీడీ బోర్డులో సీనియర్ సభ్యులకు అవగాహన ఏదీ?
- అన్నిసార్లు బోర్డులో ఉన్నా ఈ విషాదం ఎందుకు?
- వారికి టీటీడీపై ఇంకా పట్టు దొరకలేదా?
- టోకెన్ సెంటర్లు వద్దని చెప్పలేదా?
- సమావేశాల్లోనూ వారిది మౌనరాగమేనా?
- సలహా, సూచనలు ఇచ్చే సీన్ లేదా?
- మరెందుకు వారి అనుభవం?
- సీనియర్ సభ్యులపై భక్తుల ప్రశ్నల వర్షం
- స్థానికుడైన భాను ప్రకాష్‌రెడ్డి మౌనం ఎందుకు?

మహానాడు ఫోకస్



(మార్తి సుబ్రహ్మణ్యం)

ఒకరు ఐదుసార్లు.. ఇంకొందరు నాలుగుసార్లు.. మరికొందరు మూడు సార్లు.. ఒకరిద్దరి రెండుసార్లు! ఏమిటీ నెంబర్లు? కొంపదీసి ఇవేమైనా భారత్‌కు వచ్చిన ఒలింపిక్ పతకాలు అనుకుంటున్నారా? అయితే కచ్చితంగా త(ప)పులో కాలేసినట్లే. ఇవన్నీ ప్రతిష్టాత్మక టీటీడీలో వరసగా కొనసాగుతున్న సభ్యుల సంఖ్య. అంటే వీరంతా సీనియర్ సభ్యులన్నమాట. పైసలు-పరపతి పుష్కలంగా ఉన్న కొందరు ఏళ్ల తరబడి బోర్డులో కొనసాగుతున్నప్పటికీ.. తిరుపతిలో విషాదం ఎందుకు చోటు చేసుకుంది? వారి అనుభవం ఏమైంది? అది బోర్డుకు అక్కరకు రావడం లేదా? మరి ఏమీ తెలియనివారిని అన్నేసిసార్లు మెంబర్లుగా ఎందుకు వేస్తున్నట్లు? అసలు వారికి ఏ అర్హతలున్నాయని అన్నేసి సార్లు సభ్యులుగా తీసుకున్నారు? ఇవీ వెంకన్న భక్తులు, సోషల్‌మీడియాలో సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలు.

వైకుంఠ దర్శనానికి వచ్చి అటునుంచి అటే వైకుంఠానికి వెళ్లిన ఆరుగురు భక్తుల విషాద మరణంపై వెంకన్న భక్తుల ఆగ్రహజ్వాల ఇంకా చల్లారలేదు. అందుకు సోషల్‌మీడియాలో శరపరంపరగా సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలే సాక్షి. నిన్నటి వరకూ ఈఓ, అడిషనల్ ఈఓ, చైర్మన్ వైఫల్యాలపై విరుచుకుపడిన వెంకన్న భక్తులు.. ఇప్పుడు అదే సోషల్‌మీడియా వేదికగా, సీనియర్ సభ్యుల అసమర్ధ నిర్వాకంపై నిప్పులు చెరుగుతున్నారు.

"అన్నేళ్ల నుంచి అన్నీ అడ్డుపెట్టుకుని టీటీడీ బోర్డులో కొనసాగుతున్న వారు ఇంత దారుణం జరుగుతుంటే ఏం చేస్తున్నారు? గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారా? తిరుపతిలో దర్శనం టోకెన్ సెంటర్లు ఎట్టి పరిస్థితిలోనూ పెట్టకూడదని ఎందుకు చెప్పలేదు? ధర్మారెడ్డి పాలిసీలనే అమలు చేస్తే మేం ఒప్పుకోమని ఎందుకు అడ్డుకోలేదు? మరి వారి అనుభవం ఎందుకు? చెట్టుకూ వయసు వస్తుంది" అంటూ తిరుపతి వైఫల్యంపై విరుచుకుపడుతున్నారు.

ప్రస్తుత టీటీడీ బోర్డులో 24 మంది సభ్యులు ఉన్నారు. వారిలో వైద్యనాథ్, సుచిత్రా ఎల్లా, అదిత్ దేశాయ్, సౌరబ్‌బోరా, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దర్శన్, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి సీనియర్ సభ్యులు. వీరిలో భానుప్రకాష్‌రెడ్డి, దర్శన్ ఆర్.ఎన్ మాత్రమే రెండు సార్లు సభ్యులుగా కొనసాగుతున్నారు. మిగిలివారంతా మూడు, నాలుగు, ఐదుసార్లు పనిచేసిన అనుభవం ఉన్న సభ్యులు కావటం విశేషం.

ప్రధానంగా.. కర్నాటకకు చెందిన వైద్యనాథన్ విజయవంతంగా ఐదోసారి సభ్యుడిగా కొనసాగుతున్నారు. సుచిత్రా ఎల్లా, అదితి దేశాయ్, ప్రశాంతిరెడ్డి నాలుగోసారి సభ్యులుగా కొనసాగుతరుండగా.. సౌరబ్ బోరా, జంగా కృష్ణమూర్తి మూడుసార్లుబీ భానుప్రకాష్‌రెడ్డి, దర్శన్ ఆర్.ఎన్ రెండుసార్లు టీటీడీ బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

ఇంత విశేషానుభవం ఉన్న వీళ్లంతా.. తమ హయాంలో ఏం జరిగింది? వాటిలో లోపాలేమిటి? ఆ అనుభవంతో పాటించాల్సిన పద్ధతులను ఈఓ, అడిషనల్ ఈఓకు ఎందుకు వివరించలేదన్న ప్రశ్నలు, భక్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. పోనీ వీరు చెబితే ఈఓలు పట్టించుకోరనుకోవడానికి కూడా వీల్లేదు. వీరిలో ఇద్దరు మినహా అందరూ బడా పారిశ్రామికవేత్తలే. పరపతి-పలుకుబడి ఉన్నవారే కాబట్టి, వారి సలహాలను ఈఓలు ఎందుకు అమలుచేయరన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అంటే వీరికి ఏమాత్రం అవగాహన లేదని.. కేవలం బోర్డు మీటింగులకు హాజరవడం, వీఐపీల దర్శనాలకే పరిమితమవుతున్నారన్న విషయం అర్ధమవుతోందంటూ భక్తులు సోషల్‌మీడియా వేదికగా వ్యాఖ్యానిస్తున్నారు.

సరే..వీరంతా స్థానికేతలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అయినప్పటికీ.. టీటీడీపై పీహెచ్‌డీ చేసిన స్థానిక బీజేపీ నేత, భానుప్రకాష్‌రెడ్డి కూడా ఎందుకు సూచనలు చేయలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. టీటీడీలో చీమ కదిలినా, దేశమంతా వినిపించేంత గట్టిగా గళం విప్పే భానుప్రకాష్‌రెడ్డి.. తిరుపతిలో టోకెన్ కౌంటర్లు పెట్టడం తప్పని ఎందుకు వాదించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే తిరుమలలో టీటీడీకి సంబంధించి.. బీజేపీకి చెందిన ఏకైక ప్రతినిధి ఆయనే కాబట్టి.

ధర్మారెడ్డి కంటే ముందు పాటించిన విధానాలనే అనుసరించాలని బోర్డులో ఎందుకు వాదించలేదు? అసలు పదిరోజుల దర్శన విధానం అవసరం ఏమిటని, ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నది భక్తుల ప్రశ్న. నిజానికి తిరుపతిలో ఏర్పాటుచేసిన సెంటర్లలో ఉండే సమస్యలు.. మిగిలిన సభ్యులందరికంటే, స్థానికుడైన భానుకే ఎక్కువ అవగాహన ఉంటుంది కాబట్టి. మరి అంత అవగాహన ఉన్న భాను ప్రకాష్‌రెడ్డి.. తిరుపతి సెంటర్ల ఏర్పాటుపై ఎందుకు మౌనంగా ఉన్నారన్నదే భక్తుల ప్రశ్న.





# దేశానికే తలమానికం

## ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్

- ఒకే చోట సోలార్, విండ్, హైడల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి
- ప్రాజెక్ట్ పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి
- మూడోవంతు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చే ప్రాజెక్ట్ ఇది
- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదానికి త్వరలోనే పరిష్కారం
- గ్రీన్ పవర్ ఉత్పత్తి విషయంలో దేశానికే ఈ ప్రాజెక్ట్ ఆదర్శం
- గ్రీన్ కో సంస్థ నిర్మిస్తున్న ఐ.ఆర్.ఇ.పి. పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- తొలుత ఏరియల్ వ్యూ... తర్వాత రోడ్డు మార్గం ద్వారా ప్రాజెక్ట్ పరిశీలన

**కర్నూలు,మహానాడు:** 'ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రీన్ కో సంస్థ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ (ఐ.ఆర్.ఇ.పి.) మన దేశానికే తలమానికమైన ప్రాజెక్ట్. ఒకే చోట సోలార్, విండ్, హైడల్... ఇలా మూడు విభాగాల్లో విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా ప్రాజెక్ట్‌ను డిజైన్ చేసిన విధానం అద్భుతం. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రానికి కావాల్సిన విద్యుత్ అవసరాల్లో మూడో వంతు తీర్చవచ్చు. ఈ మెగా పవర్ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 వేల మంది వరకు ఉపాధి లభిస్తుంద'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్దదైన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్న గ్రీన్ కో మిగతా.. 2లో

## పెండింగ్ బిల్లులకు

# బాబు మోక్షం

- ఉద్యోగులు, సర్కారు శాఖల కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు
- చంద్రబాబునాయుడు సంక్రాంతి కానుక
- ఆర్థికశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్



**అమరావతి:** కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పెండింగ్ బిల్లుల వ్యవహారం సస్పెన్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెరదించారు. ఏడు నెలల నుంచి ఉద్యోగులు -కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేసిన సీఎం, వారికి సంక్రాంతి కానుక అందించారు.

**పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ వివరాలు ఇవీ..**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, విద్యార్థులు, చిన్న కాంట్రాక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వ సంక్రాంతి కానుక

అన్ని వర్గాలకు కలిపి రూ. 6700కోట్లు బిల్లుల విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

సంక్రాంతి కానుకగా, బిల్లుల, బకాయిలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ మిగతా.. 2లో




హోటల్‌ను దౌర్జన్యంగా లాక్కున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు 03



ఫ్రీగా సాక్షి? 03



రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ గుండాల దాడి 06



## కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు

# సులభతర వాణిజ్య విధానం

- మద్యం కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం
- కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదు
- బకాయిలు క్రమంగా క్లియర్ చేయాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:** రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టీజీబీసీఎల్ కు సరఫరా చేస్తున్న కంపెనీలు కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్యవిధానం అనుసరించాలని చెప్పారు. కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని అప్రమత్తం చేశారు.

కొత్త కంపెనీల నుంచి అప్లికేషన్లకు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజులు నిర్ణీత గడువు ఇవ్వాలని మిగతా.. 2లో

# అభివృద్ధి బాధ్యత 'కూటమి'దే

- విభజనతో ఆంధ్రాకు అన్యాయం
- విభజన ఎంతో బాధకు గురి చేసింది
- ఆత్మీయ కలయిక వేదికతో ఐక్యంగా ఉద్యమిస్తాం
- ఆదర్శ సంక్రాంతి ఆత్మీయ కలయికలో కిరణ్‌కుమార్‌రెడ్డి




**విజయవాడ:** విభజనతో ఆంధ్రకు అన్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం అభివద్ధికి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రముఖ సోషలిస్టు నాయకులు, సమతా పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు అధ్వర్యంలో రిటైర్డ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ ఏబీవెంకటేశ్వరరావు అధ్యక్షతన 10వ ఆదర్శ సంక్రాంతి ఆత్మీయ కలయిక పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగింది. మిగతా.. 2లో

# పెండింగ్ బిల్లులకు బాబు మోక్షం

మొదటి పేజీ తరువాయి..

- ఉద్యోగులకు జీపీఎఫ్, సరెండర్ లీవులు, సిపిఎస్ కంట్రిబ్యూషన్ కలిపి మొత్తం రూ.1300 కోట్లు.
- ఉద్యోగులకు రూ. 519 కోట్లు జీపిఎఫ్ విడుదల
- పోలీసు శాఖకు సంబంధించి నాలుగు సరెండర్ లీవుల పెండింగ్
- పోలీసులకు ఒక ఇన్ స్టాల్మెంట్ సరెండర్ లీవులకు మొత్తం రూ.214 కోట్ల విడుదల. 54 వేల 900 మంది పోలీసులకు లబ్ధి
- రూ.300 కోట్ల ఒక నెల సిపిఎస్ కంట్రిబ్యూషన్ విడుదల
- సిఎస్ఎస్ స్కీమ్స్ కు రూ. 627 కోట్లు
- టిడిఎస్ చెల్లింపులు రూ. 265 కోట్లు
- అమరావతి రాజధానికి, గన్నవరం ఎయిర్పోర్టుకు భూములు ఇచ్చిన రైతులకు రూ. 244 కోట్లు కౌలు చెల్లింపు
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కు ఆసుపత్రులకు చెల్లించేందుకు రూ. 400 కోట్లు
- డ్రగ్స్, మెడిసిన్స్ కు రూ. 100 కోట్లు.
- స్టూడెంట్స్‌కు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ కింద రూ. 788 కోట్లు. 6.5 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి.
- ప్రభుత్వ కాంట్రాక్టులు చేసి రూ. 10 లక్షల లోపు ఉన్న అన్ని బిల్లులు రిలీజ్ చేస్తాం. దాదాపు రూ. 506 కోట్లు విడుదల
- 26,000 వేల మంది కాంట్రాక్టర్లకు లబ్ధి. వీరితో పాటు భూసేకరణ లబ్దిదారులు కూడా నిధులు విడుదల.
- ఎంఎస్ఎంఈ రూ. 90 కోట్లు. 651 కంపెనీలు, 6651 లబ్దిదారులు
- విద్యుత్ శాఖ్ డిస్కంలకు రూ. 500 కోట్లు విడుదల
- ప్రభుత్వంలో వివిధ శాఖల్లో నిర్వహణా బిల్లులు రూ.366 కోట్లు.
- ఇవి కాకుండా పెండింగ్‌లో ఉన్న మరి కొన్ని బిల్లులు, బకాయిలు విడుదల.
- మొత్తం కలిపి రూ. 6700 కోట్లు విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశం.రేపటి నుంచి లబ్దిదారుల అకౌంట్లలో జమ అవ్వనున్న నిధులు

## వడ్డే ఒబన్నకు ఆదర్శంగా మెరుగైనసమాజ నిర్మాణం కోసం కృషి చేద్దాం

- వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు
- వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది
- మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న.
- ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



**ఒంగోలు:** ప్రకాశం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నూకసాని బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వడ్డెర కులస్తులు వెన్నుముక లాంటివారు. అలాంటి వడ్డెర కులానికి చెందిన నాయకుడు వడ్డే ఓబన్న ఆయన్ని కేవలం వడ్డెర కులాని కి పరిమితం చేయడం లేదు.

ఆయన ఒక బ్యాక్వర్డ్ క్యాస్ట్ కు చెందిన ఆయన స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని 1864లో 47 ఏళ్ల వయసులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్ఫూర్తితో ముందుకెళ్లి అనేక ఉద్యమాలు చేశారు. దళారులతో తన జీతాన్ని తగ్గించి ఇబ్బందులు గురిచేస్తుంటే వారిపై దండయాత్ర చేసి బడుగు బలహీన వర్గాల కోసం వారి ఖజానాన్ని కొల్లగొట్టి బడుగు బలహీన వర్గాల ప్రజలకు పంచిపెట్టారు.

అంత పెద్ద అంతా గొప్ప వ్యక్తి వడ్డే ఓబన్న గారు ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోని నవనిర్మాణ మెరుగైన సమాజానికి కృషి చేయాలని ఆయన కోరారు.

## సొంత సైన్యంతో ఆంగ్లేయులపై పోరాడిన ఓబన్న

- మంత్రి సవిత



**గుంటూరు, మహానాడు:** రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయటంతో పాటు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ తో కృషి చేస్తున్నారని మంత్రి ఎస్. సవిత తెలిపారు. ?శనివారం స్థానిక శ్రీనివారావుతోటలోని ఏ కన్వేక్షన్ హాలులో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. స్వతంత్ర సమరంలో బడుగు బలహీన వర్గాల హక్కుల రక్షణకు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న పోరాటం చేశారన్నారు. 1845 సంవత్సరంలో దాదాపు 9,000 మంది సైనికులను ఆంగ్లేయ వారితో పోరాటానికి సిద్ధం చేశారన్నారు. ఆ సమరంలో వడ్డేర కుల స్థుల పాత్రను ప్రజలందరికీ తెలియచేయాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రిఒడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర , జిల్లా స్థాయిల్లో ఘనంగా నిర్వహించాలని ఉత్తర్వులను జారీ చేశారన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39,007 కోట్లు కేటాయిందన్నారు. గత ఏడు నెలలుగా బీసీల సంక్షేమానికి 17 రకాల స్వయం ఉపాధి పథకాల కోసం బ్యాంకు లింకేజీతో రాయితీ రుణాలు మంజూరుకు రూ.1977.53 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

శాసన మండలి సభ్యుడు చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల జనాభాలో రెండో స్థానంలో ఉన్న వడ్డేర కులస్థులు సామాజి కంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వడ్డేరలను ఎస్టీ లలో చేర్చటానికి 2014 - 19 లో ప్రత్యేక కమిటీని వేశారని, దానిని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, కన్నా లక్ష్మీ నారాయణ, ఎండీ నసీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, వడ్డేర, వెనుకబడిన తరగతుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి సుభాష్‌తో ప్రాణహాని

మొదటి పేజీ తరువాయి..

ఫిర్యాదు చేశారు.అమలాపురం నియోజకవర్గానికి చెందిన సుభాష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత దొంగలబ్యాచ్‌ను వెంటేసుకుని తిరగడంతో పార్టీ అప్రతిష్ఠపాలయిందన్నారు. దానితో తాను వారిని పక్కనపెట్టాలని సూచించానని వివరించారు. తనకు మంచి మిత్రుడయినందుకే.. మీ వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించానన్నారు. అయినా మంత్రిలో మార్పు రాకపోవడంతో, తాను మంత్రి లోకేష్‌కు నియోజకవర్గంలో జరుగుతున్న వాస్తవాలు ఫిర్యాదు చేశానన్నారు.

దానిని జీర్ణించుకోలేని మంత్రి తనపై ద్రాక్షారామం పోలీసుస్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయించారని పేర్కొన్నారు. తనపేరుతో తప్పుడు అకౌంట్ సృష్టించి దాని ద్వారా శాంతిభద్రతలసమస్య సృష్టించే ప్రయత్నాలు చేశారన్నారు. ఆ విషయాన్ని తాను డీజీపీకి సైతం ఫిర్యాదు చేశానన్నారు. తాను నియోజవర్గంలో మంత్రి అరాచకాలను మీడియా, సోషల్ మీడియా, శెట్టిబలిజ సంఘం దృష్టికి తీసుకువెళుతుండటంతో సహించలేని మంత్రి.. అమలాపురం నియోజకవర్గానికి చెందిన గంధం పల్లంరాజుతో కలసి, తనను హత్య చేయించేందుకు కుట్ర చేయించే కుట్ర చేస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దొంగతనం కేసులో ముద్దాయిలుగా ఉన్న పండు రమేష్‌తోపాటు.. రవ్వ భూషణం, కాటే సుబ్రమణ్యం ద్వారా తనపై అక్రమ ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారని ఫిర్యాదు చేశారు.



**కురిచేడు టౌన్‌లో శ్రీ నాగూర్ మీరావలి షరీఫ్ గంధం జండా మహోత్సవం, అన్నదాన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ(టీడీపీ)దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు.**



## ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ రూ.88.55 కోట్ల డివిడెండ్

**హైదరాబాద్:** 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ రూ. 88.55 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ డివిడెండ్ చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకి అందజేశారు. సింగరేణి కాలరీస్ చెల్లింపు మూల ధనం(పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్ ) లో 10 శాతాన్ని డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తం సుమారు రూ.173 కోట్లు కాగా.. సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో నుంచి 88.55 కోట్ల రూపాయలను డివిడెండ్ చెల్లించింది.

సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలు తీర్చుతూ లాభాలను ఆర్జిస్తూ కార్మికులకు లాభాల వాటా చెల్లించడమే కాకుండా ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌లు చెల్లించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.





## దేశానికే తలమానికం ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్

మొదటి పేజీ తరువాయి..

సంస్థకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి రంగంలో శిలాజ ఇంధనాల బదులు పునరుత్పాదక శక్తి ఇంధన విభాగమే ముందంజలో ఉంటుందని, గ్రీన్ పవర్ ఉత్పత్తి విషయంలో దేశానికే ఈ ప్రాజెక్ట్ ఆదర్శంగా నిలుస్తుందని కితాబిచ్చారు. శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రీన్ కో సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సైట్ ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాష్ట్రానికే పేరు తెచ్చే ప్రాజెక్టు ఇది. రాళ్లు, రప్పల్లో 10వేల మందికి ఉపాధి కల్పించారు. ఇప్పటి వరకు మన దేశంలో గ్రీన్ కో సంస్థ రూ.లక్షన్నర కోట్లు పెట్టుబడి పెట్టింది. మన రాష్ట్రంలో రూ.30 వేల కోట్లు పెట్టుబడులుపెట్టారు. మరో రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్క పిన్నాపురం ప్రాజెక్టులోనే దాదాపు రూ. 12వేల కోట్లు పెట్టుబడులు పెట్టారు. మరో రూ. 10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటి వరకు 12 వేల మందికి ఉపాధి కల్పించారు.

వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. ఐటీ తరవాత ఆయన ఎక్కువ ఫోకస్ చేసింది



గ్రీన్ ఎనర్జీ పరిశ్రమపైనే. చలమలశెట్టి అనిల్ ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పగానే వెంటనే మొదలుపెట్టాలని ఎంకరేజ్ చేశారు. చాలా తక్కువ కాల వ్యవధిలో ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. మొత్తం 2,800 ఎకరాల్లో నిర్మిస్తోన్న ప్రాజెక్టు ఇది. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదు. 2800 ఎకరాల్లో 1700 ఎకరాలను ప్రభుత్వం, రైతుల నుంచి గ్రీన్ కో సంస్థ కొనుగోలు చేసింది. కేంద్రం అనుమతితోనే 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది.

అందుకు నెల్లూరులో రూ.36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది. 1962 నుంచి ఈ వివాదం నడుస్తోంది. ఈ భూమి మాదంటే మాది అని రెవెన్యూ, అటవీ శాఖలు అంటున్నాయి. అందులో 11.49 ఎకరాలు రైతుల నుంచి గ్రీన్‌కో కంపెనీ కొనుగోలు చేసింది. ఈ వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం. అలాగే వివాద పరిష్కారానికి మా వంతు సహకారం అందిస్తాం.

గొప్ప పర్యాటక కేంద్రంగా మారనుంది

కొద్దిసేపటి క్రితమే ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టును పరిశీలించాను. గని సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్, పవర్ హౌస్ చూశాను. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు గొప్ప పర్యాటక కేంద్రంగా, విజ్ఞాన కేంద్రంగా మారబోతోంది. వేలాది మంది ఉపాధి కల్పిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో చిన్న చిన్న వివాదాలు ఉంటే మా ప్రభుత్వం తరపున సహకరించి పరిష్కరిస్తాం. సీఎస్ఆర్ కింద గ్రీన్ కో చాలా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తోంది. పాఠశాల అభివృద్ధి, సేంద్రియ సాగు, గో సంతతి పెంచేలా చూడాలని నా తరపున కోరుతున్నా.

అలాగే కర్నూలు, కడప జిల్లాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని మా దృష్టికి వచ్చింది. అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తాం. ఎవరైతే ప్రభుత్వ, అటవీ భూములు అక్రమించారో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

### స్వయంగా కారు నడుపుతూ... ప్రాజెక్ట్ పరిశీలన



మధ్యాహ్నం 12 గం.కు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఓర్వకల్లు, గని సోలార్ విద్యుత్ ప్రాజెక్టుతో సహా పిన్నాపురం, గుమ్మటంతాండ గ్రామాల మధ్య నిర్మించిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం అప్పర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్ వద్ద ప్రాజెక్టును



పరిశీలించారు. అనంతరం పవన్ కళ్యాణ్ స్వయంగా కారు నడుపుతూ పవర్ హౌస్‌కు చేరుకున్నారు. ప్రాజెక్టు వివరాలను సంబంధిత అధికారులు ప్రజెంటేషన్ ద్వారా పవన్ కళ్యాణ్ కి వివరించారు. ప్రాజెక్టులో పని చేసే కార్మికులతో సరదాగా ముచ్చటించి వారితో సెల్ఫీలు దిగారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీలు బిందు మాధవ్, ఆదిరాజ్ సింగ్ రాణా, గ్రీన్ కో కంపెనీ ఎండీ చలమలశెట్టి అనిల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం

మొదటి పేజీ తరువాయి..

ముఖ్యమంత్రిఆదేశించారు. ఆ కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టాలని చెప్పారు.

ఎక్సైజ్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్ పాల్గొన్నారు.

ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. కంపెనీల ఒత్తిడి కి తలొగ్గేది లేదని, పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్ర తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరల ను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

గత ఏడాదిగా ఎక్సైజ్ శాఖకు ఎప్పటి కప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు క్రమంగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.

## అభివృద్ధి బాధ్యత 'కూటమి'దే

మొదటి పేజీ తరువాయి..

ముఖ్యఅతిథిగా విచ్చేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కృష్ణా డెల్టా గోదావరి జలాలకు వరల్డ్ బ్యాంకు ద్వారా రూ.1200 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ కమిటీ... రైతులకు లాభనష్టాలు, సమైక్యాంధ్ర ఉద్యమం తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. 1969 ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రజలు 7శాతం కాగా ప్రస్తుతం 30శాతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన తనను ఎంతో బాధకు గురిచేసిందని పేర్కొన్నారు. కృష్ణారావు ఆశయసాధనకు ఆత్మీయ కలయిక వేదికతో ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు.

అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణారావు స్ఫూర్తినిచ్చారని, కృష్ణా డెల్టా ఉద్యమ విజయానికి ముందు ఉండి నడిపించారని, ఆయన పట్ల ఆత్మీయ భావం, గురు సంబంధం ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### ఐక్య ఉద్యమాలు అవశ్యం: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఐక్య ఉద్యమాల అవసరమని అన్నారు. కృష్ణారావు ఇండియన్ పీపుల్స్ పార్టీ జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్నా, సామాన్య వ్యక్తిగా ప్రజల మధ్య నిలిచారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి అమరావతితో పాటుగా పోలవరాన్ని నిర్మించి బహుళ ప్రయోజనాలపై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మీయ







కలయిక బాధ్యతలను సంతోషంగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు.

తొలుత హైకోర్టు న్యాయవాది రవితేజ పదిరి మాట్లాడుతూ మన తెలుగురాష్ట్రం విభజన తరువాత ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ఆంధ్రుల భవిష్యత్తు కోసం, అభివృద్ధితో కూడిన అభ్యుదయ ప్రణాళికలను సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

ప్రసార మాధ్యమం ద్వారా అనారోగ్యంతో ఉన్న కృష్ణారావు సందేశాన్నిస్తూ దేశ సంస్కృతి, ప్రకృతిని కోరుకునే వారంతా భారతదేశ భవిష్యత్తుకు నిర్దేశకులుగా ఉండి ఆత్మీయ కలయికను కొనసాగించాలని ఆకాంక్షించారు.



రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విజయవాడ మళ్లీ రాజకీయాలకు చర్చావేదిక కావాలని, వాసిరెడ్డి కృష్ణారావు కోరిక కూడా అదేనన్నారు. విజయవాడలో అభ్యుదయ వేదిక ద్వారా ప్రెషర్‌గ్రూప్ ఆవిర్భావించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో రాజకీయ, సామాజిక చైతన్యం తీసుకువచ్చి, పాలకులను సరైన రీతిలో నడిపించేందుకు ఒక మార్గదర్శి కావాలని, అందుకు రాష్ట్ర ప్రయోజనాల కోణంలో ఆలోచించే ఒక ప్రెషర్‌గ్రూప్ అవసరం ఉందన్నారు.

విజయవాడ మళ్లీ రాజకీయ చైతన్యానికి కేంద్రం కావలసిన అవసరాన్ని, ఈ వేదిక గుర్తించాలని సూచించారు. ఇలాంటి సమ్మేళనాల వలన మనం ఎక్కడున్నాం? ఎటు వెళుతున్నాం? ఎటు వెళ్లాలన్న అంశాన్ని గుర్తించి, దానిపై చర్చించే అవకాశం ఏర్పడుతుందన్నారు. అంతిమంగా అందరికీ రాజకీయాలకు అతీతంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయం కావాలన్నారు. ఇలాంటి వేదికను ఏర్పాటుచేసిన ప్రముఖ న్యాయవాది పదిరి రవితేజ ప్రయత్నాన్ని అభినందించారు. వాసిరెడ్డి కృష్ణారావు ఆశయాలను రవితేజ కొనసాగించాలని ఏబీ సూచించారు.

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డీ హరినాథ్, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, వైసీపీ నేత ఎన్ రాజారెడ్డి, పౌర హక్కుల సంఘం నేత వీ ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు అక్కినేని భవాని ప్రసాద్, ప్రముఖ ప్రవాసాంధ్రులు కోమటి జయరామ్, నల్లమోతు చక్రవర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు, బలరామయ్య, తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ప్రసంగించారు. నిర్వాహకులు టి దామోదర్, గెజిటెడ్ అధికారుల సంఘం నేత కేవీ కృష్ణయ్య, విశాలాంధ్ర మహాసభ శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు నందిగం కిషోర్, సామాజిక కార్యకర్తలు ఎన్. హెచ్. సురేష్, గొల్లమూడి కిషోర్, అన్ని రాజకీయ పార్టీలు, సిద్ధాంతాలు, అస్తిత్వ ఉద్యమాల ప్రతినిధులు, కార్మిక కర్షక నాయకులు, సాంఘిక కార్యకర్తలు, పౌర హక్కుల ఉద్యమకారులు ఆలోచనలను పంచుకున్నారు. అనంతరం ఇటాలీయన్స్‌కు చెందిన దావా బృందం ముద్రించిన పుస్తకాన్ని కిరణ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. రంగం రాజేష్ అధ్వర్యంలో జరిగిన జానపద, అభ్యుదయ, గీతాలు, నృత్యాలు ఆహుతులను అలరించాయి. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
03
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025

# ఫ్రీగా సాక్షి?

- ఉచితంగా పేపర్ పంచాలని బోర్డు మీటింగ్‌లో ఎండీ భారతీ నిర్ణయం?
- ప్రభుత్వంపై చిమ్మే విషాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే నిర్ణయం
- బస్టాండ్లు, ఆసుపత్రులు, పార్కులు, జనసంచార ప్రాంతాల్లో పేపర్ ఉంచేలా ప్లాన్?
- రోజుకు అదనంగా లక్ష పత్రికలు ముద్రించాలని నిర్ణయం...ఏడాదికి రూ.25 కోట్లు ఖర్చు
- గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి సాక్షి పత్రిక, టీవీకి రూ.850 కోట్ల ప్రకటనలు
- ప్రకటనల రూపంలో దోచుకున్న సొమ్ముతో ఇక ఉచితంగా పేపర్

(పెండ్యాల ప్రసాద్)

సాక్షి పత్రిక ఇక ఉచితంగా లభించనుంది. రూ.7లకు విక్రయించే సాక్షి పత్రిక ఉచితంగా ఎలా ఇస్తారని అనుకుంటున్నారా. మీ సందేహం కరెక్టే..కానీ ఉచితంగా ఇచ్చేది రోజువారీ పాఠకులకు కాదు. కూటమిపై వ్యతిరేకత పెంచేందుకు, ప్రజల మెదళ్లలోకి విద్వేషాన్ని ఎక్కించేందుకు జనాభా రద్దీగా ఉండే ప్రాంతాల్లో పత్రికను పంపిణీ చేయనున్నారు.

జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని సువర్ణపాలనతో పరిగెత్తించినట్లు, జగన్ దిగిపోగానే రాష్ట్రం దివాలా తీసి, ఏదో అయిపోందని ఆరు నెలలుగా బాకా ఊదుతోంది. అయితే అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ప్రామాణికంగా సాగుతున్న కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత నూరిపోసేందుకు ఈ డోస్ సరిపోవడం లేదని నిర్ధారణకు వచ్చారు.

వైసీపీ నేతలు, సాక్షి చిమ్మే విద్వేషాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు రోజుకు లక్ష పేపర్ల చొప్పున అదనంగా ముద్రించి ఫ్రీగా అందించాలని ఇటీవల జరిగిన బోర్డు మీటింగ్‌లో ఎండీ భారతీ నిర్ణయించారని తెలుస్తోంది. అయితే ఆ లక్ష అదనపు కాపీలు పక్కాగా జనావాస ప్రాంతాల్లో పంపిణీ చేసేలా నిర్ణయించినట్లు సమాచారం. దీనికోసం బస్టాండ్లు, ఆసుపత్రులు, పార్కులు, సినిమా హాళ్లు, టీ స్టాళ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో పత్రికను ఉచితంగా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## యేడాదికి రూ.25 కోట్లు ఖర్చు

తన సొంత పత్రిక అయిన సాక్షి, టీవీ ఛానల్‌కు జగన్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అడ్డగోలుగా ప్రకటనలు ఇచ్చుకున్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను కూడా తుంగలో తొక్కి ప్రకటనలకు కోట్ల రూపాయలు కుమ్మరించుకున్నారు. అక్షరాలా రూ.859 కోట్లు జగన్ ఐదేళ్ల పాలనలో సాక్షి పత్రిక, టీవీకి ప్రకటనల రూపంలో దోచిపెట్టుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విద్వేషపు రాతలు, తప్పుడు కథనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అక్రమ సొమ్మును వినియోగించనున్నారు.



దీనికోసం ఏడాదికి రూ.25 కోట్లు ఖర్చు పెట్టాలని జగన్ సతీమణి భారతీ గట్టి నిర్ణయం తీసుకున్నారన్నట్లు వినబడుతోంది. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ఎంత ఖర్చు అయినా పర్వాలేదని, మళ్లీ అధికారంలోకి రాగానే ఖర్చు పెట్టిన సొమ్మును ఎలాగైనా రాబట్టుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారట భారతి. దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన భారతీ త్వరలోనే ఈ కుట్రను అమలు చేయనున్నారు.

## సెంటిమెంట్ రగిల్చే అంశాలే ప్రధాన అస్త్రంగా..

ఇక తాము రాసే కథనాలు, ప్రచురించే తప్పుడు వార్తలతో ప్రజల్లో సెంటిమెంట్ రగిలించాలని భారతీ రెడ్డి నిర్ణయించారట. ఎలా అంటే 2019 ఎన్నికల ముందు వివేకా హత్యలో తన బావ అవినాష్ రెడ్డి, తన సమీప మనుషులు ఉన్నా చంద్రబాబే హత్య చేయించారని నమ్మించడానికి నారాసుర రక్త చరిత్ర అని రాసినట్లు నమ్మించేలా. అంతేకాదు వివేకా హత్య వెనక తన బావ అవినాష్ రెడ్డి, తాను, తన భర్త జగన్ రెడ్డి లేరని బుకాయించి చెప్పేందుకు సొంత మరదలైన షర్మిలారెడ్డిపై కూడా అసత్యాలు రాసినంతగా ఉండాలని నిర్ణయించారట.

ఇక అవి పాత చింతకాయ పచ్చడి కావడంతో మళ్లీ అమరావతి, ఆరోగ్య శ్రీ, ఇంగ్లీష్ మీడియం, ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ వంటి కొన్ని ప్రధాన అంశాలపై పెద్ద ఎత్తున కల్పిత రాతలతో ప్రజలను తప్పుదారి పట్టించేలా కథనాలు రాయాలని బోర్డు సమావేశంలో భారతీ ఎడిటర్, ఇతర ముఖ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశా రట.

అవసరమైతే ఇందుకోసం స్వయం ప్రకటిత మేధావులుగా చెప్పుకునే పలువురి సలహాలు, సూచనలు, అవసరమైతే వారికి నెలకు కొంత చొప్పున ఎంతోకొంత ముట్టజెప్పి తప్పుడు కథనాలు రూపొందించేందుకు నిర్ణయించారని తెలిసింది. వీరి విద్వేష వ్యూహాలకు ప్రజలు ఆకర్షితులవుతారా? కుట్రలను తెలుసుకుని తిప్పికొడతారా అన్నది చూద్దాం.

# సీఐడీ వనంలో పెరిగిన 'తులసి'మొక్క!


- గుడివాడ తులసి మహిమ అంతింతకాదయా

(జీఎన్ఆర్)

సునీల్ కుమార్‌తో తులసి బంధం మామూలు స్నేహబంధం మాత్రమే కాదు ..అంతకు మించి. సునీల్ కుమార్ పేరుకు మాత్రమే సీఐడీ చీఫ్. కానీ మొత్తం కార్యక్రమాలు నిర్వహించేది తులసీబాబే. అనధికారిక అడిషనల్ డీజీగా చలామణి అయ్యేవాడు. అతడికి సీఐడీ అధికారుల వాహనం కేటాయించేశాడు సునీల్ కుమార్. బదిలీలు, పనిష్మెంట్లు, పదోన్నతుల ఫైల్స్ అన్ని సంబంధిత వ్యక్తుల నుంచి రేట్లు వసూలు చేశాక సంతకం కోసం మాత్రమే సునీల్ వద్దకు పంపేవాడు తులసి. దిశ పోలీస్ కోసం మూడు కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించారు అప్పట్లో డీజీపీ గౌతమ్ సవాంగ్. దిశకు ప్రత్యేక హెచ్ఓడీ లేనందున సీఐడీ లో ఉంచారు ఆ నిధులు . వాటిని తులసి సహాయం తో పూర్తిగా వాడేశారు సునీల్ తులసితో పాటు మరొక అనధికారిక వ్యక్తి జోగారావు కూడా అడిషనల్ డీజీగా పనులు చక్కబెట్టేవాడు. ఆయన వాడే వాహ నాలకు కూడా పోలీస్ వెహికల్ నంబర్లు కేటాయించేశారు. టోల్ గేట్లు చెక్ పోస్టు సహా ఎక్కడా ఎవరూ ఆపకుండా ఉండేందుకు.

బినామీ అయినా జోగారావు తో రేపల్లె లో అనేక పదుల ఎకరాల్లో రొయ్యల చెరువులు నిర్వహించారు. వాటికి మేత తెచ్చేందుకు ..కూలీల కోసం రెండు పోలీస్ వాహనాలు వాడేవారు. తులసి బాబుకు, జోగారావుకు ఇద్దరికీ కూడా హోమ్ గార్డులు ఇద్దరిద్దరు చొప్పున డ్రైవర్లు ఉండేవారు. కళ్యాణ్ అనే మరొక హోమ్ గార్డ్ కు మరొక ఇన్నోవా ఇచ్చారు. తులసి చెప్పిన "వారినీ " చెప్పిన చోటకు బాస్ కోసం తీసుకొచ్చి మళ్లీ దింపడమే అతని పని. అలాగే బాస్‌కు అత్యంత సన్నిహితం అయినా ఎన్నారై మహిళ ఇండియాకు వచ్చినప్పుడు ఆమె కోసం ఒక పోలీస్ వాహనాన్ని 8 నెలల పాటు వరంగల్‌లో ఏర్పాటు చేశారు హోమ్ గార్డ్ డ్రైవర్ తో సహా .

నాగార్జున యూనివర్సిటీ వెనుక మూడు విల్లాలు తీసుకున్నాడు తులసి . బాస్ తులసి జోగారావు కోసం ఒకటి కార్యక్రమాల కోసం మరొకటి ..స్టాఫ్ కుక్ డ్రైవర్ల కోసం ఇంకొకటి. తులసి సోదరుడు వైసీపీ తరపున స్వస్థలం




బాపట్ల జిల్లా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నాలుగు పోలీస్ వాహనాలు ప్రచారం కోసం ఇచ్చేశారు కూడా. అగ్రి గోల్డ్ భూముల కబ్జా, వైజాగ్‌లో భూముల కబ్జాకు పోలీస్ ప్రైవేట్ సెటిల్మెంట్లు లెక్క లేనన్ని చేసి కోట్లు గడించి, సింగపూర్ దుబాయ్‌లో పెట్టుబడులుగా తరలించారు.

2024 ఎన్నికలకు ముందు డబ్బు లెక్కల్లో తనను మోసం చేశాడని తెలుసుకొని సునీల్ తులసిని దూరం పెట్టాడు. 30 పర్సెంట్ తనకు ఇచ్చి 70 పర్సెంట్ తులసి మింగేసాడని తెలిసి షాక్ అయ్యాడు సునీల్ . ఆ తర్వాత సునీల్ ద్వారానే పరిచయం అయిన వెనిగండ్ల రాము కుటుంబం తో సన్నిహితం అయ్యి..ఆ పంచన చేరాడు తులసి జస్ట్ ఎన్నికలకు ముందు!

# ఏపీకి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి

- ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ పూర్తి
- పరిశ్రమల మంత్రి టి.జి భరత్

**అమరావతి:** కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ.14 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదిరిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కు చెందిన యిటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెస్ గ్రూప్, బి.ఎన్ గ్రూప్‌లు కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో హైదరాబాదులో మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎం.ఓ.యూ కుదుర్చుకున్నట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు.

అమరావతిలో గత నెలలో మంత్రి నారా లోకేష్‌తో కంపెనీ ప్రతి నిధులు సమావేశమై పెట్టుబడులు పెట్టే విషయంపై చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. రూ.14వేల కోట్ల ఈ భారీ సెమీ కండక్టర్ పరిశ్రమ ఇండియాలో మొదటిసారిగా మన రాష్ట్రంలో ఏర్పాటు కానుందన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును తీసుకొచ్చామని మంత్రి భరత్



అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పెట్టబోయే ఈ భారీ సెమీ కండక్టర్ ప్రాజెక్టును రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసే దిశలో ముందుకు వెళుతున్నామన్నారు.

ఈ ప్రాజెక్టు రావడంతో పాటు మరిన్ని పరిశ్రమలు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌కు రానున్నాయన్నారు. ఈ సెమీ కండక్టర్ పరిశ్రమ వల్ల వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని తెలిపారు. రాయలసీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఈభారీ ప్రాజెక్టు తీసుకురావడం సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అన్ని ప్రాంతాలను సమా నంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు.

# హోటల్‌ను దౌర్జన్యంగా లాక్కున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు



- వారసత్వంగా వచ్చిన భూమి కబ్జా చేశారంటూ మహిళ ఆవేదన
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు మొరపెట్టుకున్న బాధితులు
- అన్నక్యాంటీన్‌కు విరాళాల వెల్లువ

**మంగళగిరి, మహానాడు:** 2014లో స్పీకర్‌గా ఉన్న సమయంలో కోడెల శివప్రసాద్ రావు నరసరావుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డులో షాపు ఏర్పాటు కోసం కొంత స్థలం ఇచ్చారు. అందులో చిన్నపాటి టిఫిన్ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక హోటల్‌పై కన్నేసిన అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మనుషులు దౌర్జన్యంగా లాక్కున్నారు. భర్తను కోల్పోయి ఏ ఆధారం లేని నా లాంటి అభాగ్యురాలు నుంచి దౌర్జన్యంగా హోటల్ లాక్కున్న వైసీపీ నేతలు సుబ్బారెడ్డి, లక్షణ్‌రెడ్డిపై చర్యలు తీసుకుని నా హోటల్ నాకు అప్పగించేలా చేయండి అని వీరవల్లి వెంకాయమ్మ అనే మహిళ సీఎం చంద్రబాబుకు విన్నవించారు. హోటల్ దగ్గరకు వెళ్లిన ప్రతిసారీ దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు.

మంగళగిరి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయానికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించారు. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర బాధిత వర్గాల నుంచి వినతలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.




పల్నాడు జిల్లా, దుర్గి మండలం, మంగాపురంలో తనకు వారసత్వంగా వచ్చిన ఐదెకరాల పొలంలోకి గ్రామంలోని కొందరు వ్యక్తులు దిగనీయకుండా దాడికి పాల్పడుతున్నారని, గతంలో తన తల్లిని కూడా చంపారని మాచర్లకు చెందిన యరిపల్లి ముత్యాలమ్మ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 2009లో కూడా ఒకసారి తనను చంపేందుకు కుట్ర పన్నారన్నారు. పొలం సమస్యపై దుర్గి ఎమ్మార్వోను ఆశ్రయించినా ఎటువంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలు విన్న సీఎం పరిష్కారానికి హామీ ఇచ్చారు.



## అన్నక్యాంటీన్‌కు విరాళాలు

అన్నక్యాంటీన్‌కు మొక్కపాటి శేషగిరిరావు, రాధాకృష్ణ అనే ఇద్దరు దాతలు రూ.1 లక్ష చొప్పున విరాళం ఇచ్చారు. చెక్కులను సీఎం చంద్రబాబుకు అందించారు. పేదల కడుపు నింపే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వానికి మద్దతుగా ముందుకొచ్చినందుకు శేషగిరిరావు, రాధాకృష్ణను సీఎం చంద్రబాబు అభినందించారు.










జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 ||

# కాంగ్రెస్‌ది అరాచక పాలక

◆ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి కాంగ్రెస్ గుండాల దాడిని ఖండించిన రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్



**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన చేస్తున్నదని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ విమర్శిం చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన హామీ లను నెరవేర్చకుండా ప్రశ్నించే వారిపై దౌర్జన్యానికి దిగే విష సంస్కృతికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విరుచుకుపడ్డారు. హోంశాఖ తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సందర్భంలోనూ హింసను ప్రోత్సాహించే విధంగా మాట్లాడటం వల్లే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన ముసుగేసుకుని ప్రతీకార పాలన చేస్తున్నది. కనీస ప్రజాస్వామిక వాతావరణం కూడా లేకుండా ఎమర్జెన్సీ చీకటిరోజులను తలపిస్తున్నది. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయచేతకాని రేవంత్ సర్కార్ ఏడో గ్యారంటీగా తన మార్క్ ప్రజాస్వామ్యాన్ని చాటుకుంటున్నాడు.



## 'తొక్కిసలాట' బాధిత కుటుంబాలకు
# టీటీడీ పరిహారం

◆ నేటి నుంచి చెక్కుల పంపిణీ

**తిరుమల, మహానాడు:** తిరుమల తిరుపతి దేవస్థానంలో సంభవించిన తొక్కిసలాటకు సంబంధించి బాధిత కుటుంబాలకు టీటీడీ పరిహారం పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఈ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఘటనలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు పరిహారం పంపిణీ చేయాలని బోర్డు నిర్ణయించిన మేరకు శనివారం మధ్యాహ్నం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు ఆధ్వర్యంలో బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆరుగురు మృతులకు సంబంధించిన కుటుంబ సభ్యులకు స్వయంగా వారిని పరామర్శించి చెక్కులను పంపిణీ చేసేందుకు కొంతమంది బోర్డు సభ్యులతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. విశాఖ, నర్సీపట్నం వెళ్ళే బృందంలో బోర్డు సభ్యులు జోతుల నెహ్రూ, జంగా కృష్ణ మూర్తి, పనబాక లక్ష్మి, జానకీ దేవి, మహేందర్ రెడ్డి, ఎంఎస్ రాజు, భాను ప్రకాష్ రెడ్డి ఉన్నారు. తమిళనాడు, కేరళను వెళ్ళే బోర్డు సభ్యుల కమిటీలో శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్, నరేష్ కుమార్, శాంత రాం, సుచిత్ర ఎల్లా ఉన్నారు. వీరు స్థానిక శాసనసభ్యులతో కలిసి ఒక్కొక్కరికి రూ.25 లక్షల చెక్కులను అందించనున్నారు. అదే విధంగా ఈ కమిటీలు ప్రతి కుటుంబంలో ఒకరికి ఒక కాంట్రాక్టు ఉద్యోగంతో పాటు టీటీడీ సంస్థల్లో ఉచిత విద్యను అందించడానికి సంబంధిత కుటుంబాల ఉద్యోగ, విద్యా వివరాలను కూడా సేకరిస్తాయి. అంతే కాకుండా ఈ కమిటీ సభ్యులు తీవ్రంగా గాయపడిన భక్తులకు రూ. 5లక్షల పరిహారం చెక్కులను, పాక్షికంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్దే లక్ష్యంగా గోకులాల నిర్మాణం

- పాడి, పంటల అభివృద్దే దేశాభివృద్ధి
- గోకులం పథకం కింద షెడ్లనిర్మాణానికి పశువుల పెంపకందార్లకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీలు
- ఉపాధి హామీ పథకం కింద రాయితీ
- పశుపోషకుల్లో ఆనందం
- రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కొలుసు
- జిల్లాలో మూగజీవుల సర్వే చేయించి ఇంటింటికి వెళ్లి మూగజీవులకు నెక్కల మందులు పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం మాది

**ఆగిరపల్లి:** తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శనివారం ఆగిరపల్లి మండలము నెక్కలం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం చెడ్డను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. గత వైసీపీ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. పాడి రైతులు అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 90 శాతం సబ్సిటీ తో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులు సహకరించి తద్వారా పశు వుల పెంపకం అభివృద్దితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ మరియు జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులకు,పశువుల పెంపకం దారులకు నిరుద్యోగులకు ప్రోత్సాహంగా ప్రభుత్వము అనేక రుణాలు అందజేస్తుందన్నారు.

వీటిని ప్రతీ ఒక్క పశువుల పెంపకం రైతులు సద్వినియోగం



చేసుకోవాలన్నారు.సన్న ,చిన్నకారు రైతులు రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి రుణాలపై అవగాహన కలిగి ఉండాల న్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సన్న, చిన్న, కారు రైతులకు ప్రోత్సాహకరమైన ఋణాలు అందుబాటులో ఉన్నాయి అని వాటిపై అవగహన పెంచుకొని ఋణాలను పొందాలని తద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు పిలుపు నిచ్చారు.

రైతులకు, ఋణాలపై అవగహన మరియు వాటి లబ్ధిపై, వాటిని పొందే విధానంపై బ్యాంకర్స్, మరియు, అగ్రికల్చర్, ఇతర



ప్రభుత్వ అధికారులు కలిసి ప్రతీ నెల ఒక మీటింగ్ ఏర్పాటు చేసి రైతులకు,ముక్యంగా పశువుల పెంపకం దారులకు ఋణాలను అందించే భాద్యత మీ పై ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. అలాగే ఆధునిక ప్రపంచంలో వ్యాపారంలో పోటీ పడాలంటే ఆధునిక టెక్నాలజీ జోడించి వ్యాపారం చేస్తే ఆర్థిక ఫలాలు లాభాలు అంది పుచ్చుకోవచ్చని మంత్రి సూచించారు.

గొర్రెలు, మేకలు,పశువుల, మూగ జీవుల ఫామ్స్ నిర్మాణానికి కోటి రూపాయలు వరకు ఋణం 50 శాతం సబ్సిటీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు.దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడి ఋణాలను విస్తృతంగా గ్రామ స్థాయిలో ప్రసారం చేయవలసిన బాధ్యత బ్యాంకర్స్, మరియు ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు.ఏ ఒక్క రైతులకు బ్యాంకర్స్ ఋణాలు ఇవ్వమని చెప్పిన పక్షంలో నా దృష్టికి తీసుకొస్తే తక్షణమే బ్యాంకర్స్‌తో మాట్లాడి ఋణాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామ న్నారు. కార్యక్రమంలో, పశుసంవర్ధక అధికారులు, స్థానిక తెలుగు దేశం, కూటమి నాయకులు, తెలుగుదేశం నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





నరసరావుపేట ఎన్జీవో కాలనీలో టైనీ టాట్స్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ప్రిన్సిపాల్ పాతూరి కోటమ్మ, డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు, కనుమూరి లక్ష్మి, స్కూలు ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## రైతు సంతోషంగా ఉంటేనే
# దేశం బాగుంటుంది

◆ ప్రత్తిపాటి పుల్లారావు

**తిమ్మాపురం,మహానాడు:** యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలో రూ.2.30లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల తొలి పండుగ సంక్రాంతి అని, అటువంటి పండుగ వేళ అన్నదాతల లోగిళ్లు కళకళలాడాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని.. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా, పుట్టిన ఊరిని, కన్నతల్లిని, అన్నం పెట్టే అన్నదాతను ఎప్పటికీ మరువకూడదని పుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, టిడిపి నాయకులు కామినేని సాయి బాబు, పావులూరి శ్రీనివాసరావు, పావులూరి పిచ్చయ్య టీడీపీ నాయకులు, కార్యకర్తలు తడితలూరున్నారు.





## పుస్తక ప్రదర్శనను సందర్శించిన
# ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

◆ వివిధ రకాల పుస్తకాల కొనుగోలు

**విజయవాడ, మహానాడు:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి పుస్తకాలంటే అమితమైన ప్రేమ. పుస్తక ప్రియులైన పవన్ విజయవాడ పుస్తక ప్రదర్శనను శనివారం ఉదయం సందర్శించారు. దాదాపు రెండున్నర గంటలపాటు పలు పుస్తక కేంద్రాలకు వెళ్ళి పుస్తకాలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్ లో పుస్తకాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు కొనుగోలు చేశారు. తెలుగు సాహిత్యానికి సంబంధించి పలు పుస్తకాలు పరిశీలించారు. ప్రముఖ రచయితల నుంచి యువ రచయితల వరకూ పలువురి రచనలను కొనుగోలు చేశారు. అదే విధంగా ప్రాచీన సాహిత్యంపై వెలువరించిన విశ్లేషణలు, పరిశీలన పుస్తకాలను ఎంచుకున్నారు. వీటితో అనువాద సాహిత్య పుస్తకాలు, నిఘంటువులు, ఆధ్యాతిక సంబంధిత రచనలు పరిశీలించి కొనుగోలు చేశారు.

ఈ సందర్భంగా తనకు ఎంతో నచ్చిన 'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' పుస్తకం చూసి ఎంతో సంతోషించారు. డాక్టర్ విక్టర్ ఈ.ఫ్రాంకిల్ రాసిన ఈ పుస్తకం చదివితే నిరాశానిస్పృహలు అధిగమించి ఆశావాద భావన కలుగుతుందని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల నిర్బంధాల్లో ఉన్న ఫ్రాంకిల్ ఎలా భవిష్యత్ జీవితాన్ని నిలుపుకున్నాడో ఆ రచన తెలుపుతుందని చెబుతూ బహుమతిగా ఇవ్వడానికి ఉంటాయని ఎక్కువ సంఖ్యలో ఈ పుస్తకాలు కొనుగోలు చేశారు.

అదే విధంగా భారతీయ చట్టాలు, చరిత్ర, రాజకీయ, పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష, పర్యావరణ సంబంధిత పుస్తకాలపై ప్రత్యేక ఆసక్తి చూపారు. ఉప ముఖ్యమంత్రి వెంట విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు, ప్రదర్శన నిర్వాహకుల్లో ఒకరైన ఎమెస్కో విజయ్ కుమార్, టి.మనోహరనాయుడు, లక్ష్మయ్య, బాబ్జీ తదితరులు ఉన్నారు.

# సవాళ్లను అధిగమించి కృషి చేస్తేనే 'వికసిత తిరుపతి'

◆ 'ఇరవై సూత్రాల' చైర్మన్ లంకా దినకర్




**తిరుపతి, మహానాడు:** జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, తిరుమలకు విచ్చేసే భక్తులకు, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్మార్ట్ సిటీగా తిరుపతి అభివృద్ధిపైన కలెక్టర్ వెంకటేష్, శుభమ్ భన్సాల్ సమ న్వయంతో శనివారం ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ సమీక్షించారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం వికాసిత భారత్ 2047 – ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పని చేస్తేనే తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి విజయవంతంగా "వికసిత తిరుపతి"గా రూపుదిద్దవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఉపాధి పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, గతంలో జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరుపైన, జిల్లాలో గ్రామాల్లో ప్రతి గృహానికి మంచినీరు ఇచ్చే సంకల్పంతో జల్ జీవన్ మిషన్ అమలు తీరు, తిరుపతి పట్టణంలో అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధిం చిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలను, స్మార్ట్ సిటీ నిధుల వినియోగం పైన, తదితర కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు పర్యాటక రంగ, పారిశ్రామికీకరణ అభివృద్ధి తదితర అంశాలపైన కలెక్టర్, అధికారులతో ఆయన సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో శాసన సభ్యుడు, టీటీడీ బోర్డ్ మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదా శివ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

# ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన ఓబన్న

◆ రేనాటి వీరుడికి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘన నివాళి

**మంగళగిరి, మహానాడు:** ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన రేనాటి వీరుడు వడ్డెర ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతిని ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి భారతావని స్వేచ్ఛకోసం ఓబన్న చేసిన పోరాటం శ్లాఘనీయమన్నారు. నిరంకుశ బానిస సంకెళ్ల నుండి విముక్తికోసం ఓబన్న చేసిన త్యాగం ఆదర్శనీయన్నారు. ఇటువంటి వీరులను ప్రపంచానికి తెలియజేసేందుకు కూటమి ప్రభుత్వం ఓబన్న జయంతిని అధికారంగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. నంద్యాల జిల్లా సంజమాల మండలం నొస్సం గ్రామంలో పుట్టి ఉయ్యాల నరసింహారెడ్డికి ఆప్తమిత్రుడిగా స్వేచ్ఛ కోసం పోరాడి తెల్ల దొరలకు ముచ్చెమటలు పట్టించి చిన్నవయస్సులోనే అమరుడైన ఓబన్న నేటి యువతకు ఎంతో ఆదర్శమన్నారు.



ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపి కనకమేడల రవీంద్ర, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, కార్పొరేషన్ చైర్మన్ లు నీలాయపాలెం విజయ్ కుమార్, కోటేశ్వరరావు, గుమ్మడి గోపాలకృష్ణ, బుచ్చిరాంప్రసాద్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, మీడియా కో ఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, బండారు వంశీ, వడ్డెర సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత అభ్యున్నతికి కూటమి సర్కారు కృషి

◆ మంత్రి కందుల దుర్గేష్

**విజ్జేశ్వరం, మహానాడు:** రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిబద్ధతతో వారి మేలుకోరి పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో శనివారం రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులాన్ని మంత్రి, కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ సంప్రదాయ పద్ధతిలో గోమాతకు పూజలు నిర్వహించారు.

పొలంలో వరి నాట్లను స్వయంగా నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఎడ్ల బండిపై గ్రామంలోకి విచ్చేసి సంక్రాంతి వేడుకల్లో భాగస్వామ్యం అయ్యారు. మహిళలు చిన్నారులు వేసిన ముగ్గులను, సంప్రదాయ పద్ధతిలో హరినామం చేస్తున్న



హరిదాసు సంకీర్తన ను ఆసక్తిగా తిలకించి, భోగి మంటలను వెలిగించి ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మినీ గోకులాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో పశు సంపద అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. అదే క్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో 680 మినీ గోకులం నిర్మాణం కోసం రూ.15 కోట్ల 59 లక్షలతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.6 కోట్ల 18 లక్షల వ్యయంతో 304 షేడ్స్ నిర్మాణం పూర్తి చేసామన్నారు.

నిడదవోలు నియోజకవర్గం లో 128 గోకులాలు మంజూరు కాగా ఇప్పటివరకు రు. 1కోటి 13 లక్షల రూపాయలతో 54 గోకులాలను పూర్తి చేశామన్నారు. పశుసంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు సొమ్ము 1600 కోట్ల బకాయిని కూటమి ప్రభుత్వం చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో రూ.15.59 కోట్ల రూపాయలతో 680 గోకులాలను మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు మద్దంశెట్టి వరలక్ష్మి, తిర్నాతి నాగమణి, దొడ్డిపట్ల భవాని, దేవరపల్లి హేమ సుందరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వర రావు, గ్రామ సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

5

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 12, జనవరి 2025

## పాలన చేతకాక దాడులు

- బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి తప్పుడు చర్య
- రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పాయి.
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్





హైదరాబాద్: పాలన చేతకాక కాంగ్రెస్ పార్టీ దాడులకు తెగబడుతుందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ గుండాలను పంపి దాడులు చేయిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకే ప్రశ్నిస్తే కేసులు పెట్టడం లేదంటే వారి గుండాలను పంపి దాడులు చేయించడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. యథా రాజా తథ ప్రజా అన్నట్టు రేవంత్ రెడ్డి ఏ విధంగా మాట్లాడుతున్నారో వారి పార్టీ కార్యకర్తలు అదుపు తప్పి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

హెూమ్ మినిస్టర్ లేని రాష్ట్రంలో గాడి తప్పిన లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి చర్యను గుర్తుపెట్టుకుని రానున్న రోజుల్లో వాటికి బదులిస్తామన్నారు. ఇలాంటివి ఎన్ని దాడులు చేసిన సరే తప్పకుండా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

## దేవుడు మానవజాతిని తన పోలికలో సృష్టించెను

- రెవ ఫాదర్ ప్రవీణ్ గోపు




చిన్న అవుటపల్లి: బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి తిరునాళ్ళ సందర్భముగా ఎనిమిదవ రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు. రెవ ఫాదర్ ప్రవీణ్ గోపు, కపూచిన్ గురువులు, వైస్ ప్రోవిన్షియల్, రెక్టర్, వియాన్ని కాలేజీ, ఏలూరు వారు దివ్య పూజ బలిని సమర్పించి, దేవుడు మానవ జాతిని తన పోలికలో సృజించెను అన్న అంశంపై బోధించారు. మానవుడు దేవుని ప్రతిరూపం కనుక దైవీక స్వభావము, దైవీక సుగుణాలతో ఉంటారని తెలిపారు. దేవుడు మన తండ్రి, మనం ఆయన బిడ్డలం కనుక మనం ఒకరితో నొకరము సోదర భావంతో జీవించాలని తెలిపారు. మనం ఏ మతానికి, ప్రాంతానికి చెందిన, మనం అందరం ఒకే దేవుని బిడ్డలం, మనమంతా సహోదరీ సహోదరులము.

### బ్రదర్ జోసఫ్ తంబి సుమాతృక

దైవ సేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి జీవితము మనకు ఆదర్శం. బ్రదర్ జోసఫ్ తంబిసాటివారిని ఎంతగానో ప్రేమించారు. సాటివారిని దేవుని అనుసరణలో జీవింప జేయటానికి ఎంతగానో కృషి చేశారు. దేవునియందు అపారమైన భక్తి విశ్వాసమును కలిగి జీవించారు. ఆయన అందరిని దేవుని బిడ్డలుగా భావించాడు. అందరిలో క్రీస్తు సాన్నిధ్యాన్ని, రూపాన్ని చూసాడు.

అందరిని సమదృష్టితో చూసాడు, ఆదరించాడు. అందరిని గౌరవించాడు. అందరిలో మంచిని చూసాడు. కుల, మత, భాష, ప్రాంత బేధాలు లేకుండా అందరిని ప్రేమించాడు. అందరిని ఆప్యాయంగా పలకరించాడు. కష్టంలోనున్న వారికి దయతో సహాయం చేసాడు. పేదలకు వస్త్రదానం, అన్నదానం చేసాడు. వారికి సహాయం చేయుటకు భిక్షాటన కూడా చేసాడు.

అనేక సందర్భాలలో సామాజక న్యాయం కోసం పాటు బడ్డాడు. శాంతి స్థాపనకు కృషి చేసాడు. నేడు తంబి గారు మన మధ్యలో లేనప్పటికీ, తన ప్రార్థన ద్వారా ఎంతోమంది ఎన్నో మేలులు పొందుచున్నారు. ఇవన్నీ కూడా తంబిగారి సోదర ప్రేమకు నిదర్శనం. మనముకూడా ఒకరినొకరు ప్రేమించు కొనుచు, ఒకరి కష్టములలో ఒకరము తోడుగా ఉండాలి. ఒకరి పట్ల ఒకరము గౌరవమును, సహోదర ప్రేమను కలిగి జీవించాలి. దేవుడు మనకు ఒసగిన దన్యమైన మానవ జన్మను ధన్యకరంగా స్వీకరించి, దేవునికి మహిమను చేకూరుస్తూ జీవించాలి.

పూజానంతరం, ప్రధాన యాజకులైన ఫాదర్ ప్రవీణ్ గోపు గారికి పుణ్యక్షేత్ర గురువులు సన్మానం చేశారు. నేటి ప్రార్థనలను చిన్న అవుటపల్లి సంఘస్తులు కొనియాడి, దేశపాలకుల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



## మైలవరం నియోజకవర్గంలో 137 గోకులాలకు రూ.2.87 కోట్లు మంజూరు

- గోకులాల నిర్మాణంతో చిన్న, సన్నకార రైతులకు ప్రయోజనం
- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్
- జంగాల పల్లి గ్రామంలో గోకుల షెడ్ ప్రారంభం

మైలవరం: నియోజకవర్గంలో 137 గోకులాల నిర్మాణానికి కాను రూ. 2.87 కోట్లు మంజూరు చేసినట్లు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మాణం పూర్తయిన గోకులాన్నీ శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులుకృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. పాడిరైతులసంక్షేమం కోసమే ప్రభుత్వం మినీ గోకులం షెడ్లను మంజూరు చేస్తోందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా ప్రభుత్వం రాయితీపై గోకులం షెడ్లను నిర్మి స్తోందన్నారు. మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత మైలవరం టైమ్స్ దినపత్రిక 2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ మహాకూటమి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ దాడి దుర్మార్గం

- కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్



హైదరాబాద్: భువనగిరి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ పార్టీ చేసిన దాడి దుర్మార్గం, తెలంగాణ లో 3డి పాలనలో భాగంగా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయాలు విధ్వంసం కొనసాగుతున్నది,ఒక వైపు హైడ్రా, మూసి పేర పేద ప్రజలు ఇళ్లు విధ్వంసం చేస్తుంటే, బాధితుల పక్షాన పోరాడుతున్న బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయాల పై దాడులు జరుగుతున్నాయి. హింస ను ప్రేరేపించి రాష్ట్రం లో శాంతి భద్రతల సమస్యగా మార్చాలనే ట్రాప్ లో బి ఆర్ ఎస్ పడదు.

మీరు ఎన్ని దాడులు చేసినా ప్రజలకు మీరు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు పోరాడుతాం, రాజకీయ విమర్శలకు హుందాగా సమాధానం చెప్పాలని దాడులకు దిగితే ప్రజలు క్షమించరు, పార్టీ కార్యాలయం పై దాడులు చేస్తే పోలీసులు మౌనం వహించడం కాంగ్రెస్ నిర్బంధ పాలనకు సంకేతం , ఇందిరమ్మ రాజ్యం పేర విధ్వంసాలు, కూల్చివేతలు, ఎగవేతలు,అడిగితే అరెస్టులు, దాడులు ఈ రేస్ కేసులు, మీ దాడులకు భయపడం ప్రజాక్షేత్రంలో మీ దుర్మార్గాన్ని ఎండగడతాం.

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యన్ని పాతరేస్తూ..హింసను ప్రేరేపిస్తుంది
- యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయనీయం
- రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పింది
- హెూంశాఖ తన వద్దే ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారా..?
- దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయనీయమని మాజి మంత్రి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.



మోసపు హామీలతో గద్దెనెక్కిన నాటి నుంచి ఇచ్చిన హామీలు అమలు చేయలేక..6 గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు,కార్యాలయాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ.. దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీనీ తలపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యన్ని పాతరేస్తూ.. హింసను ప్రేరేపిస్తుందని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని, హెూంశాఖ తన వద్దే ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రోత్సహిస్తు న్నారా అంటూ ఆయన ప్రశ్నించారు.

మాట్లాడితే.. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు.. దాడులకు పాల్పడడమే ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలనా సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజా స్వామ్యంలో హింసకు తావులేదని..బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేయాలనీ ఎమ్మెల్యే వేముల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ డీఎన్ఏలోనే విద్వేషం

- రాజకీయంగా ఎదుర్కోలేక దాడులు
- రాహుల్ గాంధీ వల్లించే మొహబ్బత్ కి దుకాన్ బూటకం
- కాంగ్రెస్‌ది విద్వేషం, హింసను ప్రేరేపించే దుకాణం
- కాంగ్రెస్ యువజన విభాగం గూండాల విభాగంగా మారింది
- భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టలేరు
- యాదాద్రి - భువనగిరి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడిని ఖండించిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏ లోనే ద్వేషం, హింస, విధ్వంసం ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రోద్భలంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారని విరుచుకుపడ్డారు.

బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడడం దుర్మార్గమని స్పష్టం చేశారు. భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టలేరని తేల్చిచెప్పారు. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

రాహుల్ గాంధీ వల్లించే మొహబ్బత్‌కి దుకాన్ ఒక బూటకమని తేటతెల్లమైందని, అది విద్వేషం, హింసను ప్రేరేపించే దుకాణమని ధ్వజమెత్తారు. ఇలాంటి హింసా రాజకీయాలను తెలంగాణ తిరస్కరిస్తుందని, హింసకు, విధ్వంసకర చర్యలకు తెలంగాణలో తావు లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన యువజన విభాగాన్ని గూండాల విభాగంగా తీర్చిదిద్దుతోందని మండిపడ్డారు.

యాదాద్రి భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ జరిపిన దాడి వారి అసలు రంగును బట్టబయలు చేసిందని, కాంగ్రెస్ విష సంస్కృతికి ఇదొక నిదర్శనమని చెప్పారు. ఇలాంటి సిగ్గుమాలిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెబుతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది

- బీసీలకు మరెవరు సాటిరారు
- కుల గణన సర్వే రాహుల్ గాంధీ చలవ
- వడ్డే ఓబన్న 218వ జయంతోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్:తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిరస్మరణీయుడు. బ్రిటిష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు పుట్టించిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న. బ్రిటిష్ సామ్రాజ్యంపై బాల్య మిత్రుడు ఉయ్యాల వాడ నరసింహ రెడ్డి తో కలిసి వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం చేశారు.

తెల్ల దొరలపై పోరాటంలో సైన్యాధిక్షుడిగా ఓబన్న పోషించిన వీరోచిత పోరాటం చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. ఉయ్యాల వాడ నరసింహ రెడ్డి తో ఓబన్న మిత్రత్వం బాల్యం నుంచి మరణం వరకు సాగింది. 39 ఏళ్ల వయసులోనే వీర మరణం పొందిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న.

కులాలను పక్కన పెట్టి బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

బీసీలకు మరెవరు సాటిరారు. కుల గణన సర్వే రాహుల్ గాంధీ చలవ. ప్రధాని మోదీ వెసులు బాటుతో అంబానీ, అదానీ లక్షల కోట్లకు పరిగెడుతున్నారు. తెలంగాణలో కుల సర్వే 95 శాతం పూర్తయింది. కుల సర్వే రిపోర్టు ఆధారంగా బీసీల హక్కులు అడిగేందుకు ఆస్కారం.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో బీసీ ల పాత్ర కీలకం. వడ్డేర కులస్తులు కార్పొరేషన్ చైర్మన్ల పదవులతో సరిపెట్టుకోవద్దు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే స్థాయికి రావాలి. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను డిమాండ్ చేసేందుకు ఆస్కారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 56 వేలకు పైగా ఉద్యగాలు ఇచ్చాం. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్.

పదేళ్ల కేసిఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయింది. పదేళ్ల కేసిఆర్ పాలనలో ఒక్క కార్పొరేషన్ కి సంవత్సరంలో లక్ష రూపాయలు ఇచ్చిన పాపానపోలే. బిఆర్ఎస్ నేతలు బీసీ లపై కపట ప్రేమ చూపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభివృద్ధి కట్టుబడి ఉంది. భవిష్యత్తులోనూ వడ్డేర కులానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది.



రూరల్, నందివాడ మండలాల్లో మినీ గోకులం షెడ్డులను ప్రారంభించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## రైతులకు ఆంక్షలు ఎందుకు?

- కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు దుర్వినియోగం అయిందని నిరూపిస్తారా?
- రైతులను దొంగలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రీకరిస్తుందా?
- రైతు భరోసా కింద 5వేలు ఎక్కువ ఇస్తామని మాట్లాడింది మీరు కాదా?
- ఏసీబీ కేసు రిజిస్టర్ చేస్తే ఈడీ ఎందుకు దర్యాప్తు చేస్తోంది?
- కాంగ్రెస్ ఎంఐఎం బంధం పై ఎందుకు మాట్లాడటం లేదు?
- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి ,బీ ఆర్ ఎస్ వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,చింతం సదానందం

హైదరాబాద్: రైతులు పండుగ సంతోషంగా చేసుకోలేని దుస్థితి ప్రభుత్వం కల్పించింది. రైతులకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. రైతు భరోసా అమలు విషయంలో కలెక్టర్లపై సీఎం భారం పెట్టారు. రైతులు పంట సాగు చేస్తేనే రైతుభరోసా ఇస్తామని అంటున్నారు. యాసంగిలో రైతులకు నీళ్లు ఇస్తేనే పంట వేస్తారు. కృష్ణా బేసిన్ లో యాసంగి పంటకు నీళ్లు ఇవ్వలేమని ప్రభుత్వం చేతులు ఎత్తివేసింది. సాగునీరు లేకపోతే రైతులు పంటలు వేయరు. సాగు చేయకపోతే రైతు భరోసా,పంట బోనస్ ప్రభుత్వం ఇవ్వదు. వర్షాకాలంలో పంట పండితే మా ఘనత అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

కోటీ 57 లక్షల టన్నుల వరి పంట పండింది. 16 లక్షల టన్నుల వడ్లు మాత్రమే సేకరించామని ప్రభుత్వం చెప్పింది. సేకరించిన వడ్లకు పూర్తిగా బోనస్ ఇవ్వలేదు. మేము దివాళా గాళ్లమా...మాకు అనుభవం లేదా అని కాంగ్రెస్ నేతలు మాటలు చెప్పారు. నోటికి వచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు ఇచ్చారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవడానికి మేము కారణం కాదని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు

కేసీఆర్ ప్రభుత్వంపై నెపం నెట్టి పబ్బం గడుపుకుంటున్నారు. కేసీఆర్ కంటే గొప్పగా చేస్తామని చెప్పింది మీరే కదా? రైతులకు ఇవ్వడానికి

లెక్కలు వేస్తున్నారు. రైతులు ఇప్పటి నుండి మీ లెక్క కట్టడానికి సిద్దంగా ఉన్నారు. కరెంటు ఎప్పుడు వుంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత యాసంగిలో రైతుల పంటలు ఎండిపో యాయి. సాగు చేయని భూములకు రైతు భరోసా ఎగ్గొడితే అంతకంటే దుర్మార్గం ఉండదు. వర్షాలు పడ్డా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతులకు ఆంక్షలు ఎందుకు? కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు దుర్వినియోగం అయిందని నిరూపిస్తారా? వ్యవసాయ శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం గ్రామంలో రైతు బంధు దుర్వినియోగం అయిందని నిరూపిస్తారా? రైతు బంధు దుర్వినియోగం అయిందని ఎక్కడా ఆధారాలు లేవు. రైతులను దొంగలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రీకరిస్తుందా?




రైతుబంధు అవసరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటుందా.? 20 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని అసత్య ప్రచారం చేస్తున్నారు. రైతుబంధు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. రైతు భరోసా కింద 5వేలు ఎక్కువ ఇస్తామని మాట్లాడింది మీరు కాదా? రుణమాఫీ కింద 3,500 కోట్లు ఇంకా రైతులకు చేరలేదు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రాష్ట్రాల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్బీ జేపీ ప్రభుత్వాలు విఫలం అయ్యాయి కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించుకుంటున్నాయి. కాంగ్రెస్,బీజేపీ నేతలు ఒకరిని ఒకరు రక్షించుకుంటున్నారు. ఏసీబీ కేసు రిజిస్టర్ చేస్తే ఈడీ ఎందుకు దర్యాప్తు చేస్తోంది? మేము అధికారంలో ఉన్న పదేళ్లల్లో క్రిష్ణా నీళ్లను కేంద్రం పంచలేదు.

బిఆర్ఎస్ బీజేపీ బీ టీమ్ అని కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఇప్పుడు ఎవరు ఎవరికి బీ టీమ్ అనేది బయటపడింది. కేసీఆర్ ను బలహీన పర్చడం కాంగ్రెస్,బీజేపీ లక్ష్యంగా మారింది. కాంగ్రెస్ నాయకులకు ఇక్కడ నొప్పి పుడితే ఢిల్లీ బీజేపీ నాయకులు మలాం రాస్తున్నారు

ఎంఐఎం తో కలిసి మోడీ ని ఎదుర్కొంటాం అని రేవంత్ రెడ్డి అంటే బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు? ఎంఐఎం బీ ఆర్ ఎస్ సంబధాల పై అదే పనిగా మాట్లాడిన బీజేపీ నేతలు, కాంగ్రెస్ ఎంఐఎం బంధం పై ఎందుకు మాట్లాడటం లేదు.

## ప్రభుత్వ పరంగా జరిగే లోపాలను ఎత్తి చూపాలి

- అవినీతి, అక్రమాలపైనా ఉద్యోగుల యూనియన్లు ప్రశ్నించాలి
- వైసీపీ పాలనలో అప్పటి పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడి డిస్కమ్ లను అప్పులపాలు చేశారు
- ధరల పెంపుపై నేను అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించా
- ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




నెల్లూరు: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ఉద్యోగులదే కీలకపాత్ర. కేవలం విద్యుత్ సరఫరా మాత్రమే కాదు...మిగిలిన అంశాలపైనా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఒక ట్రాన్స్ ఫార్మర్ ను మన రాష్ట్రంలో ఎంతకు కొనుగోలు చేస్తున్నారు..పొరుగు రాష్ట్రాల్లో ఎంతకు కొనుగోలు చేస్తున్నారో కూడా తెలుసుకోవాలి.

2019 -24 మధ్య కాలంలో విద్యుత్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. ప్రతి ప్రభుత్వంలోనూ కొన్ని లోపాలుంటాయి. వాటిని కచ్చితంగా ఉద్యోగులే ఎత్తి చూపాలి. స్మార్ట్ మీటర్ ను దేశంలోని ఇతర రాష్ట్రాల్లో రూ. 7 వేలు, రూ. 8 వేలకు కొనుగోలు చేస్తే ఏపీలో 3,4 రెట్లు ఎక్కువ పెట్టారు. ఎడాపెడా ధరల పెంపుపై నేను అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించాను.

ట్రాన్స్ ఫార్మర్ల కొనుగోళ్ల విషయంలోనూ భారీగా దోపిడీకి పాల్పడ్డారు. మొత్తంగా వైసీపీ పాలనలో డిస్కమ్ ల నెత్తిన వేలాది కోట్ల అప్పు పెట్టిపోయారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు బిగించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా రైతు పోరు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాం. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు బిగించబోమని స్పష్టం చేసింది. ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఉద్యోగులు రోడ్డెక్కి ధర్నాలు చేయనవసరం లేదు. కనీసం లోపాలను, అవినీతి, అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

06

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 ||

## వడ్డెరలకు ఎమ్మెల్సీ పదవి, ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన ఘనత జగన్‌దే

- వడ్డెరను తొలిసారి ప్రోత్సహించిన ఘనత వైయస్‌దే
- వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం
- ఘన నివాళులర్పించిన పార్టీ నేతలు



**తాడేపల్లి:** ఓబన్న 218వ జయంతిఈసందర్భంగా వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఘన నివాళులర్పించి, ఆయన వీరోచిత పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ..

స్వాతంత్ర పోరాటంలో భాగంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఏర్పాటు చేసిన సైన్యానికి వడ్డే ఓబన్న అధ్యక్షుడుగా ఉండేవారని, బలహీన వర్గాల్లో పుట్టిన ఓబన్న స్వాతంత్ర్యం కోసం పోరాడారని, ఎన్నో సాహసోపేతమైన పోరాటాలకు నేతృత్వం వహించారని స్మరించారు.

ప్రజల కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన యోధుడు ఓబన్న అని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయం అని చెప్పారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు ఓబన్న అని, ఆయన ఒక గొప్ప దేశభక్తుడు అని కొనియాడారు. వడ్డెరలకు వైయస్సార్‌సీపీ ఇచ్చిన ప్రాధాన్యత మరే పార్టీ ఇవ్వలేదని, వడ్డెరను తొలిసారి గుర్తించి, ప్రోత్సహించిన ఘనత నాడు వైయస్ రాజశేఖర్‌రెడ్డి దని గుర్తు చేశారు. ఆ తర్వాత వడ్డెరలకు ఎమ్మెల్సీ పదవి, ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన ఘనత జగన్‌ది అన్న లేళ్ల అప్పిరెడ్డి, మళ్లీ వైయస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే వడ్డెరలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.

ఇంకా వడ్డెర నేత వేముల శివ మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనంత సీనియర్ లేడని పదేపదే చెప్పుకునే సీఎం చంద్రబాబు, ఏనాడూ వడ్డెర లకు ఏమీ చేయలేదని తెలిపారు. ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతి నిర్వ హించడమే కాకుండా, ఆ వర్గం వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. నిజానికి ఒక్క జగన్ తమను గుర్తించి, ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా, తమ వర్గంలో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడమే కాకుండా, ఆ తర్వాత ఎమ్మెల్సీగా కూడా అవకాశం కల్పిం చారని వెల్లడించారు. తమకు కేవలం జగన్ వల్లనే న్యాయం జరిగిందని వేముల శివ చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకం రెడ్డి నారాయణ మూర్తితో పాటు, వడ్డెర నాయకులు వేముల శివ, బేబీ రాణి, గుండెల్ల ఏడుకొండలు, బత్తుల ఈశ్వరి, ఇర్ల రవిచంద్ర, వేముల ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ గుండాల దాడి

- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు ఈ భౌతిక దాడులకు తెగబడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలతోనే కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయి, ఇలాంటి దాడులకు తెగబడుతున్నారు.

కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డార న్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసిన మీ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం.. పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ప్రధాన ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా ? అన్నారు.

పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గుండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుం దన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రశాం తంగా ఉన్న తెలంగాణలో.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనీ, ఇందిరా రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాస్తుందన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ సర్కారు పాలనలో సాగుతున్న ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అన్న కేటీఆర్, రాహుల్ గాంధీ ఇప్పటికైనా తమ హిపోక్రసీని కట్టిపెట్టి, గుండాల చేతిలో చిక్కిన తెలంగాణ కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు. ఎన్నుకున్న ప్రజలతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాల పైన దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కార్యాలయానికే రక్షణ లేకపోతే ఇక రాష్ట్రంలో పరిశ్రమలకు, పెట్టుబడు లకు, మారుమూల పల్లెల్లో నివసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుం దన్నారు.

ఇలాంటి దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకం అన్న కేటీఆర్, సమైక్యరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేతను, నిర్బంధాన్ని, దాడులను తట్టుకుని నిలబడిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. మాపార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజాక్షేత్రంలో తిరగగలరా ? ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలతో పాటు, వారి వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మీరెన్ని దాడులు చేసినా, ఎన్నిరకాల అక్రమ కేసులు బనాయించినా తెలంగాణ ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాం.. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని కేటీఆర్ తెలిపారు.











## కూటమి సిగలో 'గోకులం'

- ఆంధ్రాకు అసలైన సంక్రాంతి
- ఆంధ్రాకు పశుక్రాంతి

(తులసి వాగ్దేవి)

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈసారి సంక్రాంతి పండుగ వైభవంగా జరగబోతోంది. గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో కేవలం పంచాయతీల్లో 268 గోకులాలు మాత్రమే నిర్మించింది. కేంద్రం నుండి వచ్చే నిధుల్ని డైవర్ట్ చేయడం లేదా వాటిని మురిగిపోయేలా చేయడం లాంటివి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే పంచాయతీల్లో మొన్న ఏకంగా 12,500 గోకులాలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రారంభించింది. మరో 20 వేల గోకులాలు ప్రారంభించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. వీటివల్ల గ్రామాల్లో ఆవులు, ఎద్దులను ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశంలో గుంపుగా ఉంచి వాటికి మేత, పోషకాహారం, పశుగ్రాసం అంతా ప్రభుత్వమే సమకూరుస్తుంది. వీటివల్ల ఆవుల సంతానోత్పత్తి పెరిగి పాల దిగుబడి బాగా పెరుగుతుంది. ప్రయివేట్ డైరీ ఫాంల డిమాండ్ తగ్గుతుంది. దేశంలో ఇలా గుజరాత్ ప్రభుత్వం అమలు చేస్తోంది. అక్కడ ఆవుపాల దిగుబడి వల్ల ఏడాదికి ప్రభుత్వానికి 60 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఇప్పుడు ఆ స్కీమ్ ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ ఘనత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకే దక్కుతుంది.

## సర్వరోగ నివారిణి సబ్ ప్లాన్ చట్టం



- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు బాధ్యత సంపూర్ణంగా తీసుకుంటా
- స్వాతంత్ర పోరాటం కోసం వెనుకడుగు వేయని ధీరోదాత్తులు ఆదివాసీలు, గిరిజనులు
- నాగార్జునసాగర్‌లో ఏర్పాటుచేసిన ఆదివాసి, గిరిజన ప్రజా ప్రతినిధుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**నాగార్జునసాగర్:** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం తూచా తప్పకుండా.. సంపూర్ణంగా అమలు బాధ్యత నేనే తీసుకుంటాను. వెనకడుగు వేసే ప్రసక్తిలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన నాగార్జునసాగర్ లో ఏర్పాటుచేసిన ఆదివాసీలు, గిరిజనుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కి సంబంధించి తాను చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్టానానికి ఒక నివేదిక ఇచ్చి తూచా తప్పకుండా అమలు చేయాలని కోరాం. ఆ తర్వాత తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఆమోదం పొందిందని తెలిపారు. ఈ చట్టాన్ని మొదలుపెట్టిన వ్యక్తిగా, బిల్లును ఆమోదింప చేసిన వ్యక్తిగా నాకు సంపూర్ణ అవగాహన ఉంది.

ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా పార్టీ నాకు అవకాశం ఇచ్చింది, అమలు చేసే బాధ్యత తనపై సంపూర్ణంగా ఉందని తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణిగా అభివర్ణించారు. అన్ని శాఖల సెక్రటరీలను సమావేశపరచి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం నిధుల కేటాయింపు జరుగు తుందా? లేదా? అని నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశిం చాను. ఇప్పటికే రోడ్లు ,భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు నివేదిక సమర్పించారని, మిగిలిన వారితో నివేదికలు తెప్పించి త్వరలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కింద 10 శాతం నిధులు ఇచ్చే బాధ్యత ప్రభు త్వానిదే... రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉండటం తోనే సబ్ ప్లాన్ చట్టం అమలు చేయగలుగుతు న్నామని ప్రజల్లో గట్టిగా ప్రచారం చేయాలని ఆదివాసీ ప్రజాప్రతినిధులను డిప్యూటీ సీఎం కోరారు.

ఐటీడీఏలను పునర్జీవింప చేస్తాం, వాటికి కావా ల్సిన బడ్జెట్ కేటాయించి నిరుద్యోగులకు శిక్షణ కల్పించి స్వయం ఉపాధిని కల్పిస్తాం అన్నారు. ఈ దేశ సంపద, వనరులు ఇక్కడి ప్రజలకే థామశా ప్రకారం అందాలి తప్ప కార్పోరేట్ శక్తులకు కాదు అన్నారు. రాష్ట్రంలో పీసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని 100% సంపూర్ణంగా అమలు చేస్తాం అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేపట్టిన పాదయాత్రలో ఇందిరమ్మ ప్రభుత్వం వస్తుందని ఇల్లు లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు చెప్పాను. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో హక్కులు కాదు మాట్లాడే స్వేచ్ఛను కోల్పోయాం అని రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చారు అని అన్నారు.

ఐదు లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మి స్తున్నాం.. ఎస్సీ ఎస్టీలకు అదనంగా ఒక లక్ష రూపా యలు జత చేసి ఆరు లక్షల వ్యయంతో ఇల్లు నిర్మించనున్నాము. ఈ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12, 000 చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అందించబోతున్నాము. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇవ్వబోతున్నాం. ఈ పథకాలన్నిటిని కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్యంగా ఊరురా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత చేపట్టాలన్నారు.

ఆదివాసీలు భూమిని తల్లిగా, నదులను రక్తం మాంసాలుగా భావిస్తారు, వాటి నుంచి వారిని దూరం చేస్తే ప్రాణం లేని శవాలతో సమానం. ఆదివాసీలపై ప్రేమ లేని వారు వాటి నుంచి వారిని దూరం చేసే ప్రయత్నం వేగంగా చేస్తున్నారని ఆరోపించారు. దేశ స్వతంత్రం కోసం రాంజీ గోండు, కొమురం భీం, బిర్సా ముండా పెద్ద ఎత్తున పోరాటం చేశారని, దేశ స్వతంత్రం కోసం ప్రాణాలు సైతం ఇచ్చేందుకు వెనుకాడని ధీరోదాతులు ఆదివాసీలు, గిరిజనులు అన్నారు.

హక్కులను స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అన్నారు. పిసా, అటవీ హక్కులు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, ఆర్ ఓ ఆర్, ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చట్టాలు ఇ0దుకు నిదర్శనం అన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా వచ్చిన భూముల్లో విద్యుత్ సౌకర్యం పొందేం దుకు లైన్లో వేసే క్రమంలో అటవీ శాఖ నుంచి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఆ భూముల్లో సోలార్ పవర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి, మోటార్ల ద్వారా ఆయా భూములు సాగులోకి తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు .సౌర శక్తి ఉత్పత్తికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వమే చేస్తుందని తెలిపారు.

## విద్యుత్ శాఖ కష్టాలు మాకు తెలియనివి కావు

- విపత్తుల సమయంలో అనేకమార్లు విద్యుత్ శాఖతో కలిసి పని చేశాం.
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షేక్. అబ్దుల్ అజీజ్

**నెల్లూరు:** నగరంలోని హెచ్‌ఎన్‌ఆర్ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ముస్లిం మైనారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన డైరీ ఆవిష్కరణ కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు పాల్గొని డైరీని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. మన హక్కుల కోసం పోరాడుతూ, ఇతరుల హక్కులను కూడా కాపాడాలని సూచించారు. విద్యుత్ శాఖ లేకపోతే మన జీవితాల్లో వెలుగు ఉండదని ప్రపంచం ఒక అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. ఈ మధ్య కాలంలో ప్రజలు విద్యుత్ శాఖ వారిని తిట్టడం మానే శారని 10 సంవత్సరాల ముందు ప్రతిరోజు తిట్టేవారని హాస్యం చేశారు. విద్యుత్ శాఖ వారి పని మీరు చాలా మెరుగుపడిందని విద్యుత్ శాఖకు డిమాండ్ పెరిగిందని టెక్నాలజీకి అనుగుణంగా విద్యుత్ శాఖ వారు నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. విద్యుత్ వృధా కాకుండా తీసుకోవాల్సిన చర్యల్లో నైపుణ్యం పొందాలని అన్నారు. సామాజిక వర్గం భారీగా గుర్తింపు ఎప్పుడు రాదని నైపుణ్యం బయటపెట్టి అందరికంటే బెస్ట్ గా పని చేస్తేనే గుర్తింపు వస్తుందని అన్నారు.

విద్యుత్ శాఖ వారి కష్టాలు తమకు తెలియనివి కాదని విపత్తులు వచ్చిన సమయంలో అనేకసార్లు విద్యుత్ శాఖలతో కలిసి పని చేశామని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసి ప్రజల కష్టాలు తీర్చారని విధినిర్వహణలో ఎంతోమంది చనిపోయారని వికలాంగులుగా మారారని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వంతో మాట్లాడి విద్యుత్ శాఖ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖలో చాలా ఫాస్ట్‌గా టెక్నాలజీ మారు తుందని గత ఏడాది ఉన్న టెక్నాలజీ ఈ ఏడాదికి మారిపోతుందని ఉద్యోగులు అండ్ దానికి అనుగుణంగా





నైపుణ్యాలు తెచ్చుకోవాలని అన్నారు. అన్ని అసోసియే షన్లను కలుపుకొని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. దేశంలో అక్కడక్కడ ముస్లిం సమాజానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ ఇబ్బందులను ఎదుర్కోవటానికి కలిసికట్టుగా నాయకుడిని తయారు చేసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ వారు చేసే పని మరెవ్వరూ చేయలేరని మీరు చేసే పని దేశ అభివృద్ధికి ముడిపడిందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు నన్నేసాహెబ్, జాఫర్ షరీఫ్, ఇంతియాజ్, నౌషాద్, మదీనా వాచ్ ఏజెన్సీ అదినేత ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ "క్షమాపణ" సబబే!

- తొక్కిసలాటలో మరో కోణం

(ఎం.శ్రీనివాసరావు)

నేను సారీ చెప్పాను కదా.. మీరెందుకు జనానికి సారీ చెప్పరు? అని దబాయించి మరీ అడుగుతున్నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

ఎవరిని..? టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని, ఈవో శ్యామలరావును, డిప్యూటీ ఈవో వెంకన్న చౌదరిని!

ఎవరో అడిగారని క్షమాపణలు చెప్పాలా..? సారీ చెబితే చచ్చిపోయినవాళ్లు బతికొస్తారా..? అంటూ పెడసరంగా మాట్లాడుతున్నాడు చైర్మన్ నాయుడు.. మళ్లీ పవన్ కల్యాణ్‌తో గోక్కోవడం ఎందుకులే అనుకుని, అబ్బే, నేను పవన్‌కల్యాణ్ గురించి కాదు అని తనే ఖండిం చుకున్నాడు.

ఆ తర్వాత, సారీ అన్నాడు కూడా.

ఈవో, డిప్యూటీ ఈవో మాత్రం కిమ్మనడం లేదు.

ఈఓకూ చైర్మన్ కూ పడటం లేదు. సమన్వయం అసలే లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుట ఈఓ చైర్మన్ ను కడిగేశాడు. అంటే ఇంకేదో బలమైన కారణం ఉన్నట్లే ఉంది. ఎందుకో గానీ ఈఓ, డిప్యూటీ ఈవోల మీద ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్రుగా ఉన్నాడు.

సో... చంద్రబాబు ఎలాగూ నాయుడిని తీసేయలేడు కదా. అంటే ఈవో, డిప్యూటీ ఈవోలను సాగనంపటమే తరువాయి. మొత్తానికి ఈ తొక్కిసలాట వైఫల్యం సాకుతో అంతిమంగా ఆ ఇద్దరూ బలి అన్నమాట.

అవునూ... ముక్కోటి ఏకాదశి ఒక్కరోజే కదా వైకుంఠ ద్వారా దర్శనాలు మరి ఇక్కడ పదిరోజులు జరపడం ఏమిటి..? ఎవరో మరి ఈ నిర్ణయ కారకులు..? నాటి అధర్మా రెడ్డేనా..!!

ప్రజాశక్తి స్టోరీ ఆసక్తికరమే...

ఆ సారీల యుద్ధం నడుమ నిన్నటి ప్రజాశక్తిలో ఓ స్టోరీ ఆసక్తికరంగా కనిపించింది. మిగతా పెద్ద పత్రికలకు భిన్నంగా... నిజానికి తొక్కిసలాట ఘటనలో ఏం జరిగిందో చెప్పుకొచ్చింది ఆ స్టోరీ...



జస్ట్, ఎవరో మహిళ ఊపిరాడక అభ్యర్థిస్తే పోలీసులు గేటు తీయడంతోనే తొక్కిసలాట అని పెద్ద మీడియా తేల్చిపారేసింది. కానీ ప్రజాశక్తి కాదని చెప్పింది.

ప్రజాశక్తిలో వచ్చిన ఆ స్టోరీలో కొంతభాగం ఇలా ఉంది.

బుధవారం ఉదయం ఏడు గంటల నుంచే క్యూలైన్లలో భక్తులు నిల్చున్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ జాతీయ రహదారికి దగ్గరగా ఉండడంతో , ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఈ కౌంటర్‌కు వేలా దిగా చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో భక్తుల రద్దీగా ఉండడంతో వచ్చిన జనాలను ఎదురుగా ఉన్న పార్కులో ఉంచి తాళాలు వేశారు.

ఓ పక్క ఆకలి, మరో పక్క టోకెన్లు అందవేమోనన్న ఆందోళన భక్తుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలోనే 8.40 గంటలకు 50 సంవత్సరాల వయస్సున్న ఓ మహిళ తనకు గుండెల్లో నొప్పిగా ఉందని... ఊపిరాడటం లేదని... తనను బయటకు తీసుకెళ్లాలని పోలీసులను ప్రాధేయపడింది. అప్పటివరకూ మూసి ఉన్న మెయిన్ గేటును క్రైం డిఎస్‌పి రమణకుమార్ ఆదేశాల మేరకు గేటు తీసి మహిళను బయటకు తీసుకొచ్చారు.

ఈ సమయంలోనే 50 మంది జనసేన కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. వాళ్లంతా తమ వాళ్లని... లోనికి పంపించాలని ఆ సందర్భంగా జనసేన ద్వితీయశ్రేణి నాయకుడు ఒకరు డిఎస్‌పిని కోరారు. ఆ 50 మందిని లోపలికి అనుమతించారు. దీంతో వెనక ఉన్న భక్తులు టోకెన్లు ఇచ్చేస్తున్నారని, తాము వెనుకబడిపోతామని, కొత్తవారిని లోనికి ఎలా అనుమతిస్తారని మండిపడ్డారు. ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. 50 మందిని పైగా తొక్కుకుంటూ వెళ్లిపోయారు.

సో... ఇక్కడా జనసేన..!!

ఎస్, పవన్ కల్యాణ్ సారీ చెప్పడంలో నిజాయితీ ఉంది. కానీ ప్రభుత్వం తరఫునే కాదు, తన కార్యకర్తలు కూడా ఈ తొక్కిసలాట విషాదానికి కారకులు కాబట్టి జనసేన అధినేతగా సారీ చెప్పి ఉండాల్సిందేమో

ఇక్కడే పవన్ కళ్యాణ్ పరిణతి కనపర్చి క్షమాపణ చెప్పారు కూడా.

తను బాధితుల పరామర్శకు వచ్చినప్పుడు కూడా తన ఫ్యాన్స్ ఉరఫ్ కార్యకర్తలు అక్కడ కూడా... ఆ విషాద సందర్భాన్ని కూడా పట్టించుకోకుండా పవన్ సీఎం సీఎం అని నినాదాలు చేస్తుంటే.... చివరకు పవన్ కళ్యాణ్‌కే చిరాకెత్తిపోయి వాళ్లను మందలించాల్సి వచ్చింది.

అఫ్‌కోర్స్, జగన్ వచ్చినప్పుడూ ఇదే ధోరణి జై జగన్, సీఎం సీఎం అంటూ నినాదాలు, హంగామా ! జగన్ తమ వారిని వారించి ఉండాల్సింది

అసలు ఆ సందర్భం ఏమిటి..? ఆ నినాదాలు ఏమిటి..?

ప్చ్ ... మరీ ఏపీలో ఈ మూరా?భిమానం జనానికి ప్రాణాంతకంగా మారుతోంది..!!



దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భేటీ



విజయవాడ: సంక్రాంతి సెలవుల సందర్భంగా ప్రజలు తమ సొంత ఊర్లకు పయనమైనందున జాతీయ మరియు రాష్ట్ర రహదారుల్లో ట్రాఫిక్ ఎక్కువసేపు అవ్వ కుండా ఉండేందుకు, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి డ్రోన్స్ సహాయంతో ఎప్పటికపుడు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు.



మాజీ ప్రధాని, భారతరత్న శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహ నీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 ||



## మోదీ యూట్యూబ్ సంపాదన నెలకు రూ.1.62 కోట్ల నుంచి రూ.4.88 కోట్లు

- 26 మిలియన్లకుపైగా సబ్స్క్రైబర్లు
- 9,272 వీడియోలు




ప్రధాని నరేంద్ర మోదీకి అధికారిక యూట్యూబ్ ఛానల్ ఉంది. ఆయన చేపట్టే అన్ని ప్రారంభోత్సవాలు, అధికారిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఇందులో ప్రసారమవుతాయి. ఈ ఛానల్కు 26 మిలియన్లకుపైగా సబ్స్క్రైబర్లు ఉన్నారు. ఇప్పటివరకు ఆయన 29,272 వీడియోలు పోస్ట్ చేశారు. వీటికి మొత్తంగా 636 కోట్లకుపైగా వ్యూస్ వచ్చాయి. ఓ నివేదిక ప్రకారం ఈ ఛానల్ ద్వారా మోదీకి నెలకు రూ.1.62 కోట్ల నుంచి రూ.4.88 కోట్ల ఆదాయం వస్తోంది.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

## మాచర్ల మాజీ ఎమ్మెల్యే అనుచరునిపై పీడీ యాక్ట్

**మాచర్ల, మహానాడు:** మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడు మన్నెయ్యపై పల్నాడు జిల్లా పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన మన్నెయ్యపై ఎన్నికల సమయంలో నాటు బాంబులు, మారణాయుధాలకు సంబంధించిన కేసులో ఇప్పటికే ఆయన పోలీసులు అదుపులో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కార్యకర్త జల్లయ్య హత్యకేసులోనూ ఆయన ప్రధాన నిందితుడిగా విచారణ ఎదుర్కొంటున్నారు.



గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం శనివారం జరిగింది. మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి షోలు రద్దు!

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతి, మహానాడు:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు సరైన పోలీసు భద్రత లేకుండా థియేటర్లకు వచ్చే జనాన్ని నియంత్రించటం కష్టమని, ఈ దృష్ట్యా అర్ధరాత్రి 1 గంట, తెల్లవారుజామున 4 గంటల అదనపు షోలను ప్రభుత్వం రద్దు చేసింది. 10 రోజుల పాటు రోజుకు 5 షోలకు మించకుండా ప్రదర్శించుకోవాలని, ఐదు ప్రదర్శనల్లోనే ఒకటి బెనిఫిట్ షోగా నిర్వహించుకోవచ్చని ఆదేశాలు జారీ చేసింది. గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాల అదనపు షోలపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది.



ఉండవల్లి పోర్ట్ యార్డ్ దగ్గర శనివారం ట్రక్ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహిళలకు గాయాలయ్యాయి. ఇదే సమయంలో నియోజకవర్గం లో కార్యక్రమాలు ముగించుకుని అటుగా వెళ్తున్న తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఈ ప్రమాదాన్ని చూసి, సహాయం అందించారు. క్షతగాత్రులకు ధైర్యం చెప్పి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



శ్రీ సాయిబాబా మందిరం నెహ్రూ బజార్ మార్కాపురం నందు ధనుర్మాసం సందర్భంగా డిసెంబర్ 31 నుండి జనవరి 10వ తారీఖు వరకు సుమారుగా 350 మంది 11 రోజులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణంచేశారు.

## 'ప్రాణ ప్రతిష్ఠ'వార్షికోత్సవం.. తొలి ఫొటో ఇదే



శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం అయోధ్య రామయ్య 'ప్రాణ ప్రతిష్ఠ' వార్షికోత్సవం సందర్భంగా తొలి ఫొటోను విడుదల చేసింది. ఈ వేడుక 2024 జనవరి 22న జరిగింది. అయితే వార్షికోత్సవాన్ని హిందూ క్యాలెండర్కు అనుగుణంగా ఈ ఏడాది జనవరి 11న జరుపుకుంటారు. 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఆలయాన్ని నిర్మించారు.



చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇన్చార్జి ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు, చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలుని తిరుపతి జిల్లా ఇన్ఛార్జ్ ఎస్పీగా నియమించారు.





## ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

- పరిటాలలో పల్లె పండుగలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**నందిగామ, మహానాడు:** ఎన్టీఆర్ జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఇన్ఛార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్తో కలిసి జిల్లాను ప్రగతి పథంలో ఉంచేందుకు కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నందిగామ నియోజకవర్గం కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మసీద్ బజార్లో నిర్మించిన రోడ్డుతోపాటు, రెండు మినీ గోకులం షెడ్లు ఎంపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 23న అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించామని, సంక్రాంతి ముందురోజు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలోని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకు వెళ్తున్నారన్నారు. నందిగామ నియోజకవర్గంలో వేదాద్రి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎన్టీఆర్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కావటం ఎన్టీఆర్ జిల్లా వాసుల అదృష్టమన్నారు.

అంతకు ముందు ప్రభుత్వ విప్, శాసన సభ్యుడు తంగిరాలసౌమ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో ఎన్నో అరాచకాలు అక్రమ పాలన సాగింది అన్నారు. ప్రస్తుత తమ ప్రభుత్వం ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామన్నారు. కలెక్టర్ డాక్టర్ ఉపాధి హామీలో అందరూ అనుకున్నట్టు మట్టి పనులు కాదని గట్టి పనులు చేస్తున్నామన్నారు. జిల్లాలో రెండు లక్షల జాబ్ కార్డ్స్ హోల్డర్స్ ఉన్నారని అన్నారు. 80 లక్షల లేబర్ బడ్జెట్ మ్యాన్ డేస్ దాటి పనిచేశామన్నారు. తద్వారా 172 కోట్లు వేజెస్ జనరేట్ చేశామని అన్నారు. 136 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ చేశామని 200 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పని దినాలు పెరిగితే మెటీరియల్ కాంపోనెంట్ పెరుగుతుందని ఆ దిశగా ఉపాధి హామీ పథక అధికారులు చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ మంత్రికి వివరించారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉంటే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. ఎంపీ ప్రభుత్వ మీద ఆధారపడకుండా కేశినేని ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సీఎస్ఆర్ ట్రస్టు ద్వారా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శమైన పార్లమెంటుగా తీర్చి దిద్దడంలో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ జీవితాల్లో కోటి వెలుగులు తీసుకురావాలని భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డీపీవో లావణ్య, డీఎం అండ్ హెచ్వో సుహాసిని, ఆర్డీవో బాలకృష్ణ, డీఎస్పీ తిలక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త టి.సీతారామయ్య, జనసేన సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్కు సర్వం సిద్ధం

- పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహణ
- వివిధ రూపాలలో కనువిందు చేయనున్న కైట్స్, నోరూరించే మిఠాయిలు

**హైదరాబాద్:** అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 13, 14, 15వ తేది వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో 7వ అంతర్జాతీయ కైట్ & స్వీట్ ఫెస్టివల్ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా బేగంపేట్ హరిత ప్లాజాలో పర్యాటక, సాంస్కృతిక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటర్నేషన్ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ను ఆవిష్కరించారు. అంతకుముందు స్వీట్ స్టాల్స్ను మంత్రి సందర్శించి, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన సాంప్రదాయ మిఠాయిల రుచి చూశారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని అన్నారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా కాస్మోపాలిటన్ సిటీలో స్థిరపడ్డారని వెల్లడించారు.

3రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ప్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగురవేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు.

తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, వారసత్వ కట్టడాలు, ప్రాచీన దేవాలయాలను సందర్శించాలని కోరారు. తెలంగాణ టూరిజం శాఖ అందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆ ప్రాంత చరిత్ర సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవడం పాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్



మాట్లాడుతూ... భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరని, అదే తెలంగాణ ప్రత్యేకతని అన్నారు.

కైట్ ఫెస్టివల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కైట్ ఫెస్టివల్ కు మూడు రోజుల్లో 15 లక్షల మంది దాకా వస్తారని అంచనా ఉంది. ప్రదర్శన తిలకించటానికివచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ బిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ క్లైట్ ప్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట పట్టణంలో జగన్నాధపురం, ముద్దాడవీధి,కిలుగువీధి, దేవాంగుల వీధి మరియు కామేశ్వరినగర్లో 30 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డులను కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హాజరైన మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు.



వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పులివెందుల పర్యటన వైఎస్సార్సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వైయస్ అభిషేక్ రెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించిన వైయస్ జగన్, వైయస్ భారతి, కుటుంబ సభ్యులు



పులివెందులలో అనారోగ్యంతో వున్న వైయస్ ఆనందరెడ్డి సతీమణి సుశీలమ్మను పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్



విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 7 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ఇందుకూరు పేట మండలం కొత్తూరు స్మశాన వాటికను నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

## గుణదల మేరీ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

### ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

- కలెక్టర్ కార్యాలయంలో గుణదల చర్చ్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం
- సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సిపి రాజశేఖర్ బాబు

**విజయవాడ:** గుణదల మేరీమాత ఉత్సవాలు దేశంలో తమిళనాడు నాగపట్నంలో, విజయవాడలో మాత్రమే జరుగుతాయని...ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడతాము. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా చర్చ్ కౌన్సిల్ సభ్యులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య హాల్ నందు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ , సిపి రాజశేఖర్ బాబులతోపాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించుకున్నారు. పది లక్షల మంది పైగా భక్తులు వస్తారని కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఈ సమావేశంలో చర్చ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్.విజయరాజు



మాట్లాడుతూ కొండపైకి వచ్చే రహదారిలో ఆక్రమణలు ఎక్కువగా వున్నాయని వాటిని తొలగించాలని, అలాగే నిత్యం విజయవాడ బస్టాండ్ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి గుణదల చర్చికి మినీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా వున్నాయని వారిని ఆరికట్టడానికి ఆలయ ప్రాంగణంలో పోలీస్ అవుట్ పోస్ట్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అడిగారు.

ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గుణదల మేరీమాత ఉత్సవాలకు సంబంధించి ఇలాంటి రివ్యూ మీటింగ్ చర్చ్ కౌన్సిల్ సభ్యులతో జరగటం ఇదే మొదటి సారి అన్నారు. ప్రభుత్వ పరంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్నివిధాలు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రస్తుతానికి తాత్కలిక పనులు చేపట్టి...ఉత్సవాల అనంతరం పర్మినెంట్ పనుల దృష్టి సారిస్తామన్నారు. కలెక్టర్ లక్ష్మి శా మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గుణదల చర్చి ప్రెసిడెంట్ నువ్వుల విజయబాబు, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి జోసెప్ బాట్టిస్తా, కోశాధికారి గోలి విజయానంద్ జోసెప్ , సభ్యులు జి.రవి కుమార్, పిల్లి చిరస్తు దాసు, సేవ అబ్రహం, దాసరి సిల్వ ప్రసాద్, బండి జయరాజు, జి. బాల బాబుజీ, సి.అరుణ కుమారి, జి.యేసు దీవెనమ్మ లతోపాటు ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ,టిడిపి దళిత నాయకులు నందిపాటి దేవానంద్, ఇత్తడి విక్టర్ చార్లెస్, ఊర్ల మోహనరావు, చాట్ల రాజశేఖర్, పరిసపోగు రాజేష్, సంకె విశ్వనాథం పాల్గొన్నారు..

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

8

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 ||


## కోవూరు గడ్డ తెలుగుదేశం అడ్డా!

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

**కోవూరు, మహానాడు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం, యువ నాయకుడు మంత్రి లోకేష్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వేమిరెడ్డి దంపతులు అన్నారు. కోవూరు నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు సాధించిన సందర్భంగా నెల్లూరులోని మాగుంట లేఅవుట్ లోని వేమిరెడ్డి నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారు. ఐకమత్యమే మహాబలంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి చేయడం వల్లే లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడుతున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.



## ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- భవిష్యత్ అవసరాలకనుగుణంగా డిజైన్లు ఉండాలి
- **అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**





**హైదరాబాద్:** ఈ నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు సీఎం. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు.

అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సంక్రాంతి కానుకగా రూ.6,700 కోట్ల బకాయిల విడుదలకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి:** సంక్రాంతి కానుకగా వివిధ వర్గాలకు చెందిన బిల్లుల బకాయిలు రూ.6,700 కోట్ల విడుదలకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శనివారం ఉండవల్లిలో ఆర్థిక శాఖ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుదీర్ఘ సమీక్ష అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు మరియు పెండింగ్ బిల్లుల విడుదలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాదాపు 3 గంటల పాటు సమీక్ష నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు అని ఆయన తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు, చిన్న చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు మరియు అమరావతి రైతులకు కౌలు బకాయిలు మొత్తము రూ.6,700 కోట్ల విడుదల చెల్లింపుకు ముఖ్య మంత్రి ఆమోదం తెలిపారు అన్నారు.



ఇందులో ఉద్యోగుల జిపిఎఫ్, సరెండర్ లీవ్, సిపిఎస్ బకాయిలు మొత్తము రూ.1300 కోట్లువిడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జీపీఎఫ్ బకాయిలు రూ.519 కోట్లు, పోలీస్ సరెండర్ లీవ్ బకాయిలు రూ.214 కోట్లు, సిపిఎస్ బకాయిలు రూ.300 కోట్లు, టీ డి ఎస్ బకాయిలు రూ.265 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. 6.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా ఫీజు రీయింబర్స్మెంట్ మరియు ఎస్సీ ఎస్టీ స్కాలర్షిప్ బకాయిలు రూ.788 కోట్లు, విద్యుత్ శాఖ రాయితీ బకాయలు రూ.500 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ బకాయిలు రూ.400 కోట్లు, డ్రగ్స్ మరియు మెడిసిన్స్ బకాయిలు రూ .100 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ఎంతో మంది చిన్నచిన్న కాంట్రాక్టర్లు కనీసం రూ.5 & 10 లక్షల లోపు బిల్లులు కూడా అందకుండా పలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఆ విధంగా ఇబ్బంది పడుతున్న 26 వేల మందికి లబ్ధి చేకూర్చే విధంగా రూ .586 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

651 ఎమ్మెస్ ఎం ఈ లకు మరియు మరో 6000 మంది మైక్రో ఎంటర్ప్రెన్యూర్లకు లబ్ది చేకూర్చే విధంగా రూ. 90 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేస్తున్నామన్నారు. అదేవిధంగా అమరావతి రాజధానికి, గన్నవరం ఎయిర్పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతుల కౌలు బకాయిలు రూ .241 కోట్ల చెల్లింపుకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గత ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక స్థితి చిన్నాభిన్నం అయ్యిందని, అటువంటి పరిస్థితులను చక్కదిద్ది రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారాన్నారు. ఒకవైపు రూ .10 లక్షల కోట్ల బకాయిలు మరియు వాటిపై ప్రతిరోజూ వడ్డీ చెల్లించడంతోపాటు మరో రూ .1.30 వేల కోట్ల బకాయిల ఒత్తిడి ప్రభుత్వంపై ఉందన్నారు.

వీటికి తోడు గత ప్రభుత్వం 60: 40 వాటాతో అమలు చేయాల్సిన 94 కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి కేంద్ర వాటాను పొంది రాష్ట్ర వాటాను చెల్లించకపోవడం వల్ల ఆ పథకాలన్నీ నిలిచిపోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రూ .6000 కోట్లను కేంద్రానికి జమ చేసి 73 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించడం జరిగిందన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు మంచి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## మన సినిమా ఫస్ట్‌రీల్ - నవ్వాలా? ఏడవాలా?

ఇంగ్లిష్‌లో first, ఎవర్ వంటి పదాలకు ముందు the article తప్పనిసరిగా ఉండాలి. ద ఫర్స్ట్, ద బెస్ట్ అని రాయాలి. ఇది బాల పాఠం. పీహెచ్.డీ. మేధావులకు ఈ జ్ఞానం లేకపోవడం క్షమార్హం కాదు.

రెంటాల జయదేవ, సాక్షి దిన పత్రిక ఎడిట్ పేజ్ ఇన్చార్జ్. ఆయన ఒక పీహెచ్.డీ మేధావి కూడా. ఆయన ఇటీవల 'మన సినిమా ఫస్ట్‌రీల్' అన్న పుస్తకాన్ని విరచించి విడుదల చేశారు. పుస్తకం ముఖపత్రం మీద మన సినిమా ఫస్ట్‌రీల్ అని ఉంది. అది సరికాదు, మన సినిమా ద ఫ(ర్)స్ట్‌రీల్ అని ఉండాలి. ఫస్ట్‌రీల్ పదానికి ముందు ద (the) ఆర్టికల్ తప్పని సరిగా ఉండాలి. లేక పోతే అది 'చదువు' లేని దోషమూ, విదూషకత్వమూ ఔతుంది.

అచ్చు తప్పులు, టైపోలు వంటివాటిని అర్థం చేసుకోవచ్చు. కానీ ఏం రాస్తున్నామో తెలియని స్థితిలో కనీసపు చదువు కూడా లేకుండా హాస్యాస్పదంగానూ, తెలివిడి లేకుండానూ మన సినిమా ఫస్ట్‌రీల్ అని రాయడం శోచనీయం 'రాయడం' అన్నదానికే అవమానకరం. రెంటాల జయదేవ మన సినిమా ఫస్ట్‌రీల్ అని రాసింది చదివాక నవ్వాలా? ఏడవాలా?

పుస్తకం పేరు కూడా సరిగ్గా రాయడం లేదా చెప్పడం చాతకాని రెంటాల జయదేవ పుస్తకంలో విషయాల్ని ఎలా చెప్పి ఉంటారు? ఏం చెప్పి ఉంటారు? ఆలోచిద్దాం.

పుస్తకం పేరే ఇంత అజ్ఞానంతోనూ, హాస్యాస్పదంగానూ ఉంటే ఆ పుస్తకంలోని విషయం ఇంకెంత హాస్యాస్పదంగానూ, అజ్ఞానంతోనూ, అసత్యాలతోనూ, చరిత్రకు హాని చేసిదిగానూ ఉంటుందో? ఉందో?




'ద ఫస్ట్‌రీల్' అని కూడా రాయడం చాతకాని ఒక రచయిత(?) రాసిన పుస్తకాన్ని ఎమెస్కో వాళ్లు ఎలా ప్రచురించారు?

నేను ఆ పుస్తకాన్ని చదవలేదు. ఆ పుస్తకంలో కాళిదాస్ సినిమాపై రెంటాల జయదేవ రాసిన అసత్యాలు, అవకతవకలు, విదూషకత్వం (22/12/24న సాక్షిలో వచ్చింది) గురించి నేను ఆవేదనతో సవివరంగా ఈ వరకే తెలియజేశాను.

మన సినిమా ఫస్ట్‌రీల్ అంటూ అజ్ఞానంతోనూ, హాస్యాస్పదంగానూ రెంటాల జయదేవ రాసిన ఆ పుస్తకం విషయంలో ప్రచురణకర్తలు తక్షణమే బాధ్యతాయుతంగా స్పందించి తగిన నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. విషయజ్ఞానం ఉన్న వాళ్లతో ఆ పుస్తకాన్ని సరిచేయించి మళ్లీ వెలువరించాలి. ప్రస్తుతానికి లేదా తాత్కాలికంగా ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకుని తెలుగు జాతికి, తెలుగు సినిమా చరిత్రకు మేలు చెయ్యాల్సిందిగా ప్రచురణ కర్తలు ఎమెస్కో వారికి చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎమెస్కో వాళ్లు తగిన రీతిలో స్పందించకపోతే చదువరులం మనం ఈ పుస్తకం పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఈ పుస్తకం తెలుగు జాతికి, తెలుగు సినిమాకు అసత్యాలతోనూ, అజ్ఞానంతోనూ, అవకతవకల తోనూ పెనుహాని చేస్తుందేమోనని భయం వేస్తోంది.




**- రోచిష్మాన్**

9444012279


## అయోధ్య రాముడికి వార్షికోత్సవం




అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట జరిగి చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. 2024 జనవరి 22న రాములవారికి జరిగిన ప్రాణ ప్రతిష్ట ఘట్టాలు తలుచుకుంటే ఒళ్లంతా పులకరిస్తోంది. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను మించిన శుభదినం జనవరి 22. రాముల వారి మందిరం ప్రారంభమైన రోజు.

ఆ మధుర స్మృతులు స్మరిస్తుండగానే 2025 జనవరి11 వచ్చేసింది. హిందూ కాలమానం ప్రకారం 2024 జనవరి 22న ( పుష్య మాసంలో శుక్ల ద్వాదశి )రాముల వారి ప్రాణ ప్రతిష్ట జరిగింది. హిందూ పంచాంగం ప్రకారం ఆ మహోత్సవానికి జనవరి 11న ఏడాది పూర్తవుతుంది.

ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం వేడుక చేసుకోవడానికి సిద్ధమైంది. "ప్రతిష్ట ద్వాదశి " అనే పేరుతో మహత్తర కార్యక్రమానికి రూపకల్పన చేసింది శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్.

దాదాపు 500 సంవత్సరాల తర్వాత శ్రీరామచంద్రుడు బాల రాముడిగా తన జన్మస్థలంలో నిర్మితమైన నూతన మందిరంలో కొలువు దీరిన రోజును (ప్రతిష్ట ద్వాదశి) అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా అయోధ్య రామ జన్మభూమి మందిరం పరిసర ప్రాంతాలలో మూడు రోజులపాటు ఉత్సవాలు.. విశేష కార్యక్రమాలు నాలుగు ప్రదేశాలలో నిర్వహిస్తారు.



ఆలయ సముదాయంలోని యాగ మండపంలో శుక్ల యజుర్వేదం, మధ్యందని శాఖలోని 40 అధ్యాయాల 1975 మంత్రాలతో యజ్ఞభగ వానుడికి ఆహుతులు సమర్పిస్తారు. 11 అంశాలుగా వేదమంత్రాలు జపిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, తరువాత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు యజ్ఞం కొనసాగుతుంది. శ్రీరామ మంత్రం జపించే యాగం కూడా ఇదే సమయంలో రెండు దఫలుగా నిర్వహిస్తారు. ఆరు లక్షల మంత్ర జపం. శ్రీరామరక్ష స్తోత్రం.. హనుమాన్ చాలీసా.. పురుష సూక్తం శ్రీ సూక్తం.. ఆదిత్య హృదయం పారాయణంతో పాటు,అధర్వ శీర్ష మొదలైన స్తోత్రాలు ఉంటాయి.

దక్షిణ దిశలోని ప్రార్థన మండపంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్వామికి రాగా సేవ సమర్పిస్తారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఆలయ ప్రాంగణంలో రామ్ లల్లా సన్నిధిలో అభినందన గీతాలు.. భక్తి పాటలు.. మంగళహారతులు ఉంటాయి.

యాత్రి సువిదా కేంద్రంలోని మొదటి అంతస్తులు మూడు రోజుల సంగీతమయ, శ్రీరామ చరిత మానస పఠనం ఉంటుంది. అంగద్ టీల మైదానంలో ప్రతిరోజు మధ్యాహ్నం రెండు నుంచి 3: 30 వరకు శ్రీ రామ కథ మరియు, శ్రీరామ చరిత మానస్ పై ప్రసంగాలు ఉంటాయి. ప్రతిరోజు సాయంత్రం ఐదు నుంచి సాంస్కృతి కార్యక్రమాలు.. ఈ విధంగా మందిర మొదటి వార్షికోత్సవం సందర్భంగా రాములవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మందిర ప్రారంభ వార్షిక మహోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా భక్తులు హాజరవుతుండడం విశేషం.

### రాముల వారి దర్శనం మహాభాగ్యం

త్రేతాయుగంలో రాములవారి పట్టాభిషేకంలో పాల్గొనని ప్రజలంతా నేడు కలియుగంలో) ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం అత్యంత అదృష్టంగా భావిస్తున్నారు. రాముల వారి ప్రాణప్రతిష్ట కళ్లారా చూడటం ఈ జన్మకు సార్థకత ఏర్పడిందని మురిసిపోతున్నారు. న భుతో.. న భవిష్యత్ అనే రీతిలో భూమండలమంతా సంబరాలు చేసుకున్న సుదినానికి ఏడాది గడిచిన సందర్భంగా నాటి మధురమృతులను రామభక్తులు స్మరిస్తూ తరిస్తున్నారు. "అసలు అయోధ్య రామ మందిరం అనేది ఓ కల. అది సాధ్యం కానీ అంశం. అని కొట్టిపారేసిన రోజుల నుంచి..అయోధ్య రామ మందిరం నిర్మాణం చేసి, హిందువుల కలను సాకారం చేసిన సు దినం అత్యంత పవిత్రమైనది" అని హిందువులు భావిస్తున్నారు.

పరాయి పాలన లో దౌర్జన్యానికి గురైన రామమందిరం ఐదు శతాబ్దాల తర్వాత భవ్యంగా నిర్మాణం చేసుకోవడం ఓ చరిత్ర. ప్రపంచ హైందవ జాతిని ఏకం చేసిన ఉద్యమం రామ జన్మభూమి పోరాటం. న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా సుప్రీంకోర్టులో విజయం సాధించి నిర్మించుకున్న మందిరం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆగర్భ శ్రీమంతుడు నుంచి మొదలుకుంటే.. అడుక్కుతినే వారి వరకు ప్రతి హిందువు మనస్ఫూర్తిగా నిధి సమర్పించి, ఉదారంగా విరాళాలు సమర్పించి నిర్మించుకున్న మందిరం హిందువుల స్వాభిమాన సంకేతం.

ప్రపంచంలోని ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం నింపిన అయోధ్య రామ మందిరం ప్రారంభ ఘడియలు అపురూపం.. అమోఘం.! విరామమెరుగని పోరాటంలో లెక్కకు మించిన ప్రాణ త్యాగం చేసిన కరసేవకుల త్యాగ చరిత్ర అజరామరం.. ఆచంద్రార్కం.! ఊరు వాడ ఇల్లు వాకిలి ఎటు చూసినా రాముడి జెండా రెపరెపలు.. ఊరేగింపులు.. కోలాటాలు.. భజనలు అంతా రామ రామ జపమే. జైశ్రీరామ్ నినాదాలతో లోకమంతా ఆధ్యాత్మిక వెల్లివిరిసింది.

ప్రపంచ దేశాలు ఒళ్లంతా కళ్ళు చేసుకుని వీక్షించిన సుమధుర ఘట్టం అయోధ్య రామ మందిర ప్రారంభం. మొత్తంగా చెప్పాలంటే హైందవ విజయానికి చిహ్నం రామ మందిరం. కులాలు, వర్గాలు, ప్రాంతాలు, భాషలు, పేద ధనిక తరతరమ భేదాలు మరిచి రామనామం జపించిన చైతన్య స్ఫూర్తి.. ఐక్యత రాగం రామ మందిరం.!

### హిందూ సమాజాన్ని కదిలించిన అక్షింతలు

ఐదు శతాబ్దాల తర్వాత పోరాడి విజయం సాధించి నిర్మించుకున్న రాములవారి ప్రాణప్రతిష్ట మహోత్సవంలో ప్రతి హిందువును భాగ స్వామి చేయాలనే సంకల్పం స్ఫూర్తిదాయకం. మందిర ప్రారంభానికి ప్రతి ఒక్కరిని ఆహ్వానించాలని చేపట్టిన కార్యక్రమం అద్భుతం. ప్రతి ఇంటికి రాములవారి అక్షింతలు అందజేసి మందిర ప్రారంభానికి ఆహ్వానించిన కార్యక్రమం మహాద్భుతం.

2024 జనవరి 1 నుంచి 15 వరకు కనీవిని ఎరుగని రీతిలో అయోధ్య అక్షింతలు వితరణ చేశారు. దేశంలోని ఐదు లక్షల పదివేలకు పైగా గ్రామాలకు వెళ్లి దాదాపు 11 కోట్ల కుటుంబాలకు అక్షింతలు అందజేసిన కార్యక్రమం ఓ ఆధ్యాత్మిక విప్లవం సృష్టించింది. దాదాపు 40 కోట్లకు పైగా శ్రీరామ భక్తులను కలిసి అక్షింతలు ఇచ్చి అయోధ్యకు ఆహ్వానించడం ఓ హిస్టరీ. నిర్ధారించుకున్న ఏకకాలంలో కోట్లాదిమందిని కలిసి రాముల వారి కార్యంలో పాలుపంచుకోవడం ఘన చరిత్ర.

### పూలు.. పండ్లు.. కాషాయ వస్త్రాలకు ఎడతెగని గిరాకి

అయోధ్య మందిరం ప్రారంభం రోజున కనీవినీ ఎరుగని రీతిలో హిందూ సమాజం రామభక్తిని చాటుకుంది. మార్కెట్లో పూలు, పండ్లు లభించలేకపోయాయి. ఊహించని రీతిలో భక్తులు బయటకు వచ్చి కొనుగోలు చేయడంతో పూజ సామాగ్రి, పూలు, పండ్లకు కొరత ఏర్పడింది. జెండాలు కుట్టించేందుకు కాషాయ వస్త్రాలు లభించలేక పోయాయి. అన్ని దుకాణాలలో కాషాయ వస్త్రాలు లేక వెలవెల పోయాయి. వ్యాపారులు ఊహించలేని విధంగా కాషాయ వస్త్రాలు కొనుగోలు జరిగాయి. కాషాయ వస్త్రాలతో జెండాలు కుట్టించేందుకు భక్తులు బారులు తీరారు. అయితే, ఇదే అదునుగా రెట్టింపున ధరలు ఉన్నప్పటికీ భక్తి ముందు దిగదుడిచిపోయాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుందామన్న లభించలేక పోయాయి. వ్యాపారులు తమ జీవితంలో ఊహించని విధంగా కాషాయ వస్త్రాలు, జెండాలు, పూజా సామాగ్రి కొనుగోలు జరిగింది. దేవాల యాలు కిక్కిరిసిపోయాయి. ఎటు చూసినా జై శ్రీరామ్ నినాదాలు వినిపించాయి. దీపావళిని మించి జనవరి 22వ తేదీ రాత్రి టపాసులు పేలాయి. ప్రతి ఇంటిపై దీపాలు వెలిగాయి. ఇలా ఒకటేమిటి నాటి స్మృతులు తలుచుకుంటేనే మనసులో విజయచిద్విలాసం తొనికిస లాడుతోంది.

### రైళ్లన్నీ అయోధ్యకే పయనం

ప్రాణప్రతిష్ట తరువాత దేశంలోని నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లలో రామభక్తులు అయోధ్యకు తరలి వెళ్లారు. అత్యంత నియమనిష్టలు, భక్తిశ్రద్ధలతో రాములవారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. జన్మ తరించిన అనుభూతితో ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఐదు శతాబ్దాల తర్వాత మందిర ప్రాంగణంలోకి కాలుపెట్టిన రామభక్తుల అనుభూతి అంతా ఇంతా కాదు.

### రికార్డు స్థాయిలో రాముల వారి దర్శనం

అయోధ్య రామాలయ నిర్మాణం ప్రారంభం తర్వాత ప్రపంచ వింతలలో ఒకటైన తాజ్ మహల్ ను మించి అయోధ్య రాముడిని దర్శించుకోవడం విశేషంగా చెప్పవచ్చు. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 13.55 కోట్ల మంది భారతీయులు, లక్షలాదిమంది విదేశీయులు రాములవారి దర్శన భాగ్యం పొందారు. అంటే నెలకు దాదాపు కోటికి పైగా భక్తులు రాములవారిని దర్శించుకోవడం ప్రత్యేకత.

### దీపోత్సవంతో గిన్నిస్ రికార్డు

మందిరం ప్రారంభించిన తర్వాత మొట్టమొదటి దీపావళి రికార్డు స్థాయిలో దీపోత్సవం నిర్వహించారు. దీపావళి రోజు 25 లక్షల దీపాలు ఏకకాలంలో వెలిగించి గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకున్నారు. 1121 మంది ఒకేసారి గంగా హారతి ఇచ్చి రికార్డు సృష్టించారు. సాక్షాత్తు రాముల వారి కాలంలో నిర్వహించిన దీపావళిని మించి చరిత్ర సృష్టించింది. ఇప్పటికీ ఇంకా రాములవారిని దర్శనం చేసుకొని భక్తులు ఉంటే వెంటనే వెళ్లి దర్శనం చేసుకుని రాములవారి అనుగ్రహం పొందాలి.




**- పగుడాకుల బాలస్వామి**

ప్రచార ప్రసార ప్రముఖ్

విశ్వహిందూ పరిషత్, తెలంగాణ రాష్ట్రం

9912975753,

9182674010

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 12, జనవరి 2025 ||



## 'డాకు మహారాజ్'లో కొత్త బాలకృష్ణని చూస్తారు : బాబీ కొల్లి



**వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్' చిత్రంతో అలరించనున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు బాబీ కొల్లి, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.**

### 'డాకు మహారాజ్' ఎలా ఉండబోతుంది?

బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకొని 'డాకు మహారాజ్' సినిమా చేయడం జరిగింది. అయితే బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించాము. బాలయ్య సెటిల్డ్ గా డైలాగ్ లు చెప్తే చాలా బాగుంటుంది. 'నరసింహానాయుడు', 'సమరసింహారెడ్డి' తర్వాత 'సింహా' ఎలా అయితే గుర్తుండే సినిమా అయిందో.. డాకు మహారాజ్ కూడా అలాంటి పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది. చాలా నిజాయితీగా కథను చెప్పాము.

### బాలకృష్ణ గురించి?

బాలకృష్ణ నుంచి ఎవరైనా క్రమశిక్షణ నేర్చుకోవచ్చు. దర్శకుడికి ఎంతో గౌరవం ఇస్తారు. సెట్స్ లో అందరితో సరదాగా ఉంటారు. మనం ఎంత నిజాయితీగా ఉంటే బాలకృష్ణ గౌరవిస్తారు. అభిమానులు తనను చూడటానికి వస్తారు కదా అని, డూప్ లేకుండా నటించడానికి ఇష్టపడతారు. మొండి గుర్రాన్ని సైతం కంట్రోల్ చేస్తూ, స్వయంగా స్వారీ చేసి మమ్మల్ని ఆశ్చర్యపరిచారు.

### ట్రైలర్‌లో విజువల్స్‌కి మంచి పేరు వచ్చింది కదా. ఎలాంటి కేర్ తీసుకున్నారు?

నిర్మాత నాగవంశీ బాలకృష్ణని ఎంతో అభిమానిస్తారు. ఆ అభిమానంతోనే తమ బ్యానర్‌లో వచ్చే సినిమా వైవిధ్యంగా ఉండాలి అనుకున్నారు. అలాగే ఒక దర్శకుడిగా నాకెంతో ఫ్రీడమ్ ఇచ్చారు. ఇద్దరం కలిసి ఈ సినిమాలో విజువల్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడేలా చేయాలి అనుకున్నాము. డీఓపీ విజయ్ కన్నన్ తో నాకు ముందే పరిచయముంది. అప్పుడు ఆయన జైలర్ సినిమాకి పని చేస్తున్నారు. నాగవంశీ కూడా విజయ్ పేరు చెబితే వెంటనే ఓకే అని, ఆయనతో మాట్లాడారు. అలా విజయ్ ఈ సినిమాలో భాగమయ్యారు. ఆయన ఎంతో అంకిత భావంతో పని చేస్తారు. కథను ఓన్ చేసుకుంటారు. అందుకే విజువల్స్ అంత అద్భుతంగా వచ్చాయి.

### సినిమా ఉపయోగించిన ఆయుధాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టున్నారు?

హీరోకి ఆయుధం అనేది కీలకం. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో గొడ్డలి వంటి పవర్ ఫుల్ ఆయుధం బాగా ఫేమస్. ఈ సినిమాలో అలాంటి శక్తివంతమైన ఆయుధం ఉండాలి, కానీ అది కొత్తగా ఉండాలి అనుకున్నాము. అందుకు తగ్గట్టుగానే ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ అద్భుతమైన ఆయుధాలను డిజైన్ చేశారు.

### మీ గత చిత్రాలతో పోలిస్తే 'డాకు మహారాజ్'లో కొత్తదనం ఏం ఉండబోతుంది?

నా గత సినిమాలతో బాబీ కథాకథనాలు బాగా రాస్తాడు అనే పేరు తెచ్చుకోగలిగాను. అయితే హాలీవుడ్ స్థాయిలో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని మాట్లాడుకునేలా చేయలేకపోయాను. ఇప్పుడు 'డాకు మహారాజ్'తో విజువల్స్ పరంగా గొప్ప పేరు వస్తుంది.

### రాజస్థాన్ ఎడారిలో షూటింగ్ సమయంలో అందరూ బాగా కష్టపడ్డారని తెలిసింది?

దర్శకుడు, నటీనటుల కష్టం కంటే కూడా సిబ్బంది ఎక్కువ కష్టపడ్డారని చెప్పగలను. ఎందుకంటే మేము షూట్ గ్యాప్ లో నీడలో ఉంటాము. కానీ సిబ్బంది విరామమే లేకుండా ఎండలో ఎంతో కష్టపడతారు. అందుకే వారి కష్టం ముందు మా కష్టం చిన్నది అనిపిస్తుంది.

### చిరంజీవి, బాలకృష్ణతో కలిసి పని చేయడం ఎలా ఉంది?

సినిమా విషయంలో చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ ఒకేలా ఉంటారు. ఇద్దరిలో ఎంతో క్రమశిక్షణ ఉంటుంది. ఇద్దరూ పని రాక్షసులే. నిర్మాతలకు అసలు నష్టం రానివ్వకూడదనే ఉద్దేశంతో పని చేస్తూ ఉంటారు. సినిమా కోసం ఎంతయినా కష్టపడతారు. అవుట్ పుట్ ఇంకా మెరుగ్గా రావడానికి, వారికున్న అపార అనుభవంతో పలు సూచనలు ఇస్తూ ఉంటారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ వంటి సీనియర్ హీరోలతో కలిసి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

## సర్‌ప్రైజింగ్ క్లైమాక్స్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం'



**విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్‌లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచి సినిమాపై హ్యుజ్ బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరో విక్టరీ వెంకటేష్ విలేకరుల సమావేశంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విశేషాల్ని పంచుకున్నారు.**

- విక్టరీ వెంకటేష్

### సంక్రాంతికి వస్తున్నాం కోసం ఎంత ఎక్సయిటెడ్‌గా వున్నారు ?

నా కెరీర్ ఇది మరో సంక్రాంతి. ఒక క్లీన్ ఎంటర్ టైనింగ్ ఫిల్మ్ తో రావడం చాలా ఆనందంగా వుంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్ న్యూ జానర్ కూడా వుంది. సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. అంతా పాజిటివ్‌గా వుంది. నా కెరీర్ లో సంక్రాంతికి వచ్చిన మోస్ట్ ఫిలిమ్స్ చాలా బాగా ఆడాయి. ఈ సినిమా కూడా అద్భుతంగా ఆడుతుందనే నమ్మకం వుంది.

### ఈసారి ప్రమోషన్స్ చాలా ఎనర్జిటిక్‌గా చేయడానికి కారణం?

ఇది నేచరల్ గా జరిగింది. మ్యూజిక్ చాలా నచ్చింది. నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. కొన్ని మ్యూజిక్ ట్యూన్స్ వినగానే క్రేజీగా అనిపించింది. అలాగే డైరెక్టర్ అనిల్, ఇద్దరు హీరోయిన్స్.. లైవ్లీ టీం కుదిరింది. ప్రమోషన్స్ లో ఏదైనా కొత్తగా చేయాలని అనుకున్నాం. ప్రమోషన్స్ ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేయడం హ్యాపీగా వుంది.

### మీతో సాంగ్ పాడించాలనే ఆలోచన ఎవరిది?

నైట్ రెండు గంటలకి ఆ సాంగ్ విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఏదో క్రేజీ ఎనర్జీ ఆ సాంగ్‌లో వుంది. సరదాగా నేనే పాడతానని అన్నాను. ఆ రోజు గొంతు బాగానే వుంది. ఇంగ్లీష్ వర్డ్స్ వుండటంతో నాకు ఇంకా ఈజీ అయ్యింది(నవ్వుతూ). ఇందులో రమణ గోగుల పాడిన పాట పెద్ద హిట్ అయ్యింది. చాలా గ్యాప్ తర్వాత ఆయన నా సినిమాకి పాడారు. పాటకు అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఆనందంగా వుంది.

### 'సంక్రాంతికి వస్తున్నాం' కథ విన్నప్పుడు మిమ్మల్ని ఎక్సయిట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?

ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్ గా అనిపించింది. మినిమం గ్యారెంటీ అని అక్కడే తెలిసిపోయింది. అనిల్ నాది సూపర్ హిట్ కాంబినేషన్. మేము చాలా ఫ్రెండ్లీగా వుంటాం. పెర్ఫార్మెన్స్ వైజ్ ఇందులో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్ గా వుంటుంది. చాలా షటిల్ గా కొత్తగా ట్రై చేశాం. ఫ్రెష్ సీన్స్ వుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. అనిల్ తో మంచి రేపో కుదిరింది. తనతో మూవీస్ కంటిన్యూ చేయాలని వుంది.

## కల్వర వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ సర్వీసెస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే హరీష్ రావు

సినిమా ఇండస్ట్రీలోకి వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. ఫిల్మ్ మేకర్స్ అంతా టెక్నాలజీని ఉపయోగిస్తూ వండర్స్ క్రియేట్ చేస్తున్నారు. తాజాజా హైదరాబాద్‌లో కల్వర వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ టెక్నాలజీ తమ నూతన బ్రాంచ్‌ను హైదరాబాద్‌లో లాంచ్ చేశారు డాక్టర్ మల్లీశ్వర్. ఈ వేడుక శుక్రవారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు, దర్శకులు శ్రీనువైట్ల, కరుణ కుమార్, ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ డైరెక్టర్ వందన, నటులు విక్రాంత్ రెడ్డి, రఘు కుంచె హాజరయ్యారు.





మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ 'మన తెలుగు బిడ్డ మల్లీశ్వర్ అమెరికాలో స్థిరపడి ఎంటర్‌పెన్యూర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక్కడి నిరుద్యోగ యువతికి ఉద్యోగాలు ఇప్పించాలని నేను ఆహ్వానించగానే సిద్ధిపేటలో ఐటీ కంపెనీ పెట్టి ఎంతోమంది గ్రామీణ యువతకు ఉద్యోగాలు ఇచ్చిన డాక్టర్ మల్లీశ్వర్ ని అభినందించాలి. మన తెలుగు చిత్ర పరిశ్రమ బాలీవుడ్, హాలీవుడ్‌తో పోటీ పడుతుంది. రాబోయే కాలంలో హాలీవుడ్‌తో మరింత పోటీని ఎదుర్కొవాలంటే.. ఇలాంటి వీఎఫ్ఎక్స్, ఏఐ టెక్నాలజీ చాలా అవసరం. సినిమా బడ్జెట్‌ను తగ్గిస్తూ.. విజువల్ ఎఫెక్ట్స్‌ను పెంచుతూ ప్రేక్షకులు అట్రాక్ట్ చేయాలంటే ఈ టెక్నాలజీ అవసరం ఉంది. ప్రస్తుతం ప్రపంచమంతా ఏఐ వెంట పరుగెడుతుంది.

అమెరికా నుంచి ఇండియా వచ్చి ఇది స్థాపించిన మల్లీశ్వర్ గారు ఇంకా ఎదగాలని, చిత్ర పరిశ్రమ ఎదుగుదలకు తనవంతు కృషి చేయాలని కోరుతున్నా. ఆర్ఆర్ఆర్ లాంటి చిత్రానికి ఆస్కార్ వచ్చిందంటే తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వ కారణం. ఇలాంటి టెక్నాలజీని తెలుగు పరిశ్రమకు రావడం అభినందనీయం' అని అన్నారు. దర్శకులు శ్రీనువైట్ల మాట్లాడుతూ 'మల్లీశ్వర్ మంచి ఆలోచనతో వీఎఫ్ఎక్స్‌తో పాటు ఏఐ బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఫిల్మ్ ఇండస్ట్రీలో తమ వంతుగా పాలుపంచుకోవడంతో పాటు అనేక మందికి ఎంప్లాయ్‌మెంట్ ఇవ్వడం సంతోషంగా ఉంది. సినిమా ఇండస్ట్రీలో ఆయనకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ డైరెక్టర్ వందన కల్వర వీఎఫ్ఎక్స్ టీమ్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. దర్శకులు కరుణ కుమార్ మాట్లాడుతూ 'తెలుగు సినీ ఇండస్ట్రీలో వీఎఫ్ఎక్స్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. టెక్నికల్‌గా మంచి వారిని గుర్తించడం సమస్యగా మారిన ఈ తరుణంలో మల్లీశ్వర్ ఈ కంపెనీ పెట్టడం హ్యాపీ. సరైన క్వాలిటీతో అనుకున్న టైమ్‌కి అవుట్‌పుట్ ఇవ్వగలగితే వారికి కాంపిటీషన్ ఉండదు.

ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. రఘు కుంచె మాట్లాడుతూ 'కల్వర వీఎఫ్ఎక్స్ సంస్థ ద్వారా మల్లీశ్వర్ తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.



## 'హిసాబ్ బరాబర్' ట్రైలర్

వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న ప్రముఖ ఓటీటీ జీ5 నుంచి మరో ఆసక్తికరమైన సినిమా రానుంది. అదే 'హిసాబ్ బరాబర్'. విలక్షణ నటుడు ఆర్.మాధవన్ ఇందులో ప్రధాన పాత్రలో నటించగా నీల్ నితిన్, కీర్తి కుల్హారి ఇతర పాత్రల్లో మెప్పించనున్నారు. జీ5లో జనవరి 24 నుంచి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రీమియర్‌కు సిద్ధమైందీ చిత్రం. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. ఓ బ్యాంక్ చేసే చిన్న పొరపాటు ఓ వ్యక్తి జీవితాన్ని తలక్రిందులు చేస్తే ..అతనెలా స్పందించాడు. న్యాయం కోసం అతను ఎలాంటి పోరాటం చేశాడనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. ఆర్థికపరమైన మోసం, అవినీతి, న్యాయం కోసం చేసే పోరాటం ఇవన్నీకథలో భాగంగా మిళితమై ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నాయి. విలక్షణ నటుడు ఆర్.మాధవన్, నీల్ నితిన్,కీర్తి కుల్హారి తదితరులు వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. ప్రేక్షకులు మెచ్చేలా చక్కటి డ్రామా, కామెడీ, సామాజిక అంశాలతో.. అశ్విన్ ధీర్ దర్శకత్వంలో జియో స్టూడియోస్, ఎస్?పి సినీకార్ప్ ఈ చిత్రాన్ని నిర్మించాయి. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో చిరు ఉద్యోగి అయిన రాధే మోహన్ శర్మ పాత్రలో మాధవన్ మనకు ఇందులో కనిపిస్తారు.



## డాకు మహారాజ్'తో మరో విజయం - బాలకృష్ణ

'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఐటీసీ కోహినూర్ లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది.

ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, "తిరుమల తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. బాధాకర ఘటన చోటు చేసుకోవడంతో అనంతపురంలో తలపెట్టిన వేడుకను రద్దు చేయడం జరిగింది. నా అభిమానులు క్రమశిక్షణ కలిగిన సైనికులు. అందుకే వారు మా నిర్ణయాన్ని స్వాగతించారు. ఇన్ని లక్షల, కోట్ల మంది అభిమానులను పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ముందుగా నాకు జన్మనిచ్చి, నన్ను ఆయన ప్రతిరూపంగా మీ హృదయాల్లో నిలిపిన దైవాంశ సంభూతులు, నా తండ్రి, నా గురువు, నా దైవం నందమూరి తారక రామారావుకి కృత్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నాన్న వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, ఆయన మాదిరిగానే ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించుకుంటూ వస్తున్నాను. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే అప్పట్లో 'ఆదిత్య 369'లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి ఈ 'డాకు మహారాజ్' కథ పుట్టింది. తాజాగా విడుదల చేసిన రిలీజ్ ట్రైలర్ కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. బాలకృష్ణ నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఏం కోరుకుంటారో అందుకు తగ్గట్టుగా ఈ ట్రైలర్ ఉంది. దర్శకుడు బాబీ ఆలోచనకు తగ్గట్టుగా, కెమెరామెన్ విజయ్ కన్నన్ తన అద్భుత పనితీరుతో సన్నివేశాలకు ప్రాణం పోశారు. తమన్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మూడు వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకముంది. ఇక ముందు కూడా ఇలాగే మరిన్ని మంచి సినిమాలతో మీ ముందుకు వస్తున్నాను అందరికీ సంక్రాంతికి శుభాకాంక్షలు." అన్నారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144